# చింతించుటను గూర్చి ముక్కుసూటి మాట



భావోద్రేక పోరాటములను దేవుని వాక్యశక్తితో జయించుట

జాయిస్ మేయర్

గతంలో ఈ పుస్తకము *“సహాయము చేయండి! నేను చింతించుచున్నాను”* అను పేరుతో ప్రచురితమైంది

# చింతించుటను గూర్చి

ముక్కుసూటి మాట

# చింతించుటను గూర్చి

ముక్కుసూటి మాట

భావోద్రేక పోరాటములను

దేవుని వాక్యశక్తితో జయించుట

## జాయిస్ మేయర్

JOYCE MEYER
MINISTRIES ®

Sharing Christ – Loving People

Post Bag No. 1, Jubilee Hills, Hyderabad - 500 033

Unless otherwise indicated, all Scripture quotations are taken from *The Amplified Bible* (AMP). *The Amplified Bible, Old Testament,* copyright © 1965, 1987 by The Zondervan Corporation. *The Amplified Bible, New Testament,* copyright © 1954, 1958, 1987 by The Lockman Foundation. Used by permission.

Scripture quotations marked (NKJV) are taken from *The New King James Version*. Copyright © 1979, 1980, 1982, Thomas Nelson, Inc.

Scripture quotations marked KJV are taken from the *King James Version* of the Bible.

Originally published as *Help Me I'm Worried.*

Copyright © 2018 by Joyce Meyer Ministries - Asia

All rights reserved. No part of this publication may be reproduced, distributed, or transmitted in any form or by any means, or stored in a database or retrieval system, without the prior written permission of Joyce Meyer Ministries - Asia.

Joyce Meyer Ministries - Asia
Post Bag No. 1, Jubilee Hills,
Hyderabad - 500 033

Phone: +91-40-2300 6777
Website: www.jmmindia.org

Straight Talk on WORRY - *Telugu (R1 - 2018)*
*Overcoming Emotional Battles with the Power of God's Word!*

*Printed at:*
Caxton Offset Pvt. Ltd.
Hyderabad - 500 004

# విషయసూచిక


*పరిచయం* vii

*మొదటి భాగము* – **చాటైన స్థలములో నివసించుట** 1

1. చాటైన స్థలములో నివసించుట 3
2. దేవునియందు నమ్మికయుంచి సూచికా స్తంభములను గమనించుము 9
3. అన్ని పరిస్థితులు సాఫీగానే సాగిపోవును 23
4. దేవుని తలంపులు మన తలంపులకంటే గొప్పవి 43

ముగింపు 63

*రెండవ భాగము* – **లేఖనభాగములు** 75

చింతించుటను జయించుటకు తగిన లేఖనభాగములు 77

**ప్రార్థన**

చింతించుటను జయించుటకు ప్రార్థన, ఆశీర్వాదము 80

ప్రభువుతో వ్యక్తిగతమైన సంబంధంకొరకైన ప్రార్థన 81

రక్షణ కొరకు ప్రార్థన 83

# పరిచయం

దేవుడు నీతో వ్యాపార లావాదేవీలు జరపాలని కోరుతున్నాడు. నీ చింతలు, సమస్యలు, నీ బలహీనతలను నీవు అయనకిస్తే ఆయన వాటన్నిటిని గురించి తానే జాగ్రత్త వహించాలని ఇష్టం చూపుతున్నాడు; అంటే నీ "బూడిదెకు" ప్రతిగా "పూదండ" ఇవ్వాలని కోరుతున్నాడు.

> "దేవుడు తగిన సమయమందు మిమ్మును హెచ్చించునట్లు ఆయన బలిష్ఠమైన చేతిక్రింద దీనమనస్కులై యుండుడి.
>
> ఆయన మిమ్మునుగూర్చి చింతించుచున్నాడు. గనుక మీచింత యావత్తు ఆయనమీద వేయుడి."
>
> 1 పేతురు 5:6, 7

> "ప్రభువగు యెహోవా ఆత్మ నా మీదికి వచ్చియున్నది. దీనులకు సువార్తమానమును ప్రకటించుటకు యెహోవా నన్ను అభిషేకించెను. నలిగిన హృదయముగలవారిని దృఢ పరచుటకును, చెరలోనున్నవారికి విడుదలను, బంధింపబడిన వారికి విముక్తిని ప్రకటించుటకును, దుఃఖాక్రాంతులందరిని ఓదార్చుటకును, సీయోనులో దుఃఖించువారికి ఉల్లాస వస్త్రములు ధరింపజేయుటకును, బూడిదెకు ప్రతిగా పూదండను

> దుఃఖమునకు ప్రతిగా ఆనందతైలమును, భారభరితమైన ఆత్మకు ప్రతిగా స్తుతివస్త్రమును, వారికిచ్చుటకును ఆయన నన్ను పంపియున్నాడు. యెహోవా తన్ను మహిమపరచుకొనునట్లు నీతి అను మస్తకివృక్షములనియు, యెహోవా నాటిన చెట్లనియు వారికి పేరు పెట్టబడును."
>
> యెషయా 61:1, 3

దేవుడు మన విషయమై తగిన జాగ్రత్త తీసికొనగోరుచున్నాడు. అందువలన మనకై మనము... మన విషయము జాగ్రత్త తీసికొనుటకు మానివేయాలి. దేవుడు వారిని గురించి జాగ్రత్త తీసుకోవాలని కొందరు అనుకొందురు గాని, ఆయన నడిపింపుకొరకు కనిపెట్టుకొనకుండా, వారే పరిష్కార మార్గము వెదకుదురు. అటువంటివారు బూడిదెలో పొర్లుతుంటారు. దేవుడు మనకు అందాన్ని ప్రసాదించాలంటే మన బూడిదె ఆయనకు ఇచ్చివేయాలి.

ఆయన మన విషయం తగు జాగ్రత్త తీసుకోగలడని, మరియు తీసుకుంటాడని మనం నమ్మి మన చింత ఆయనపై మోపాలి. హెబ్రీయులకు 4:3లో ఈలాగు వ్రాయబడింది; "విశ్వాసులమైన మనము ఆ విశ్రాంతిలో ప్రవేశించుచున్నాము." అనగా ఆయనలో నిమగ్నులమైన (చేర్చబడినవారమై), ఆయనను నమ్మి, ఆయనపై ఆధారపడిన మనము ఆయనయందు విశ్రాంతి పొందెదము.

దేవుని నమ్ముటద్వారా ప్రభువు యొక్క విశ్రాంతిలో ప్రవేశించుచున్నాము. చింతించుట అనునది విశ్వాసమునకు వ్యతిరేకపదము. ప్రతి చిన్న విషయానికి చింతించుట వలన మన చింత సమాధానమును దొంగిలించి, శారీరకంగా బలహీనులను చేసి రోగిష్టులనుగా తయారుచేయును. కనుక మనము చింతించుచున్నవారమైతే మనం విశ్వాసులంగా ఉండలేము గనుక దేవునియందు విశ్రాంతిలో ప్రవేశింపలేము.

ఇది ఎంత గొప్ప వ్యాపారమో చూడండి. నీవు దేవునికి బూడిదెనిచ్చి, ఆయనయొద్ద నుండి అందమును పొందగలవు. నీ దిగుళ్లు, చింత యావత్తు ఆయనకిచ్చినచో ఆయన నీకు కాపుదల, నిలకడగల జీవితము, క్షేమము కలుగచేయు స్థలము, నిండైన సంతోషము దయచేయును. దేవుడే మనలను గురించి చింతించుట! ఎంత ధన్యత, ఎంత గొప్ప సంగతి!

## *మొదటి భాగము*

# చాటైన స్థలములో నివసించుట

# 1

# చాటైన స్థలములో నివసించుట

"మహోన్నతుని చాటున నివసించువాడే సర్వశక్తుని నీడను విశ్రమించువాడు."

కీర్తనలు 91:1

దేవుడు మనలను సమాధానముతో క్షేమంగా దాచియుంచగల స్థలము సిద్ధపరచియుంచాడు. ఆ స్థలమే దేవునిలో విశ్రాంతిని, సమాధానమును ఆదరణను మనకిచ్చును. అట్టి ఆత్మీయ స్థలమునందు చింత మటుమాయమై గొప్ప సమాధానము పరిపాలించుచుండును. ప్రార్థనలో దేవుని వెదకుచు కాలము గడిపినయెడల, ఆయన సన్నిధిలో నిలిచియున్నయెడల, అదే ఆయన మనకిచ్చు చాటైన స్థలము. నివసించుటయనగా, నిలిచియుండి అక్కడనే జీవించుట అని అర్థమిచ్చుచున్నది. నీవు, నేను క్రీస్తులో నివసించి, ఆయన దయచేసిన చాటైన స్థలములో జీవించినయెడల, అట్టి స్థలమునకు మనము అప్పుడప్పుడు చుట్టము చూపుగా చూడడానికి వెళ్లము గాని, మన శాశ్వత స్థావరమును అక్కడ ఏర్పాటు చేసికొంటాము.

క్రొత్త నిబంధనలోని నివసించుట అను పదమునకు సమమైన గ్రీకు పదమును యోహాను 15:7లో వాడబడింది. దాని అర్థమేమనగా 'నిలిచియుండుట.' "నాయందును మీరును, మీయందు నామాటలును నిలిచియుండినయెడల, మీకేది యిష్టమో అడుగుడి, అది మీకు అనుగ్రహింపబడును."

నీవు, నేను దేవునియందు నిలిచియున్నాము అనగా మనము ఆయనయందు నివసించుచున్నాము అని అర్థము. యోహాను 15:7ను ఆంప్లిఫైడ్ బైబిలు ఈలాగు వివరిస్తుంది. "మీరు నాయందు జీవించినయెడల (నిలిచియుండి, గట్టిగా అంటుకట్టబడినయెడల) నామాటలు మీయందు నిలిచియుండి, మీ హృదయములలో జీవించుచున్నయెడల, మీకేది ఇష్టమో అడుగుడి అది మీ కొరకు చేయబడును."

మరో రీతిగా చెప్పాలంటే మనము దేవునిలో నాటబడియుండాలి. ప్రతిపరిస్థితిలో మనకు ఎక్కడ నుండి సహాయము కలుగుచున్నదో దానిని ఎరగాలి. మనకు సమాధానము క్షేమము కలుగచేయు మన స్వంత స్థలము మనము కల్గియుండాలి. మనము దేవునిపై ఆధారపడి ఆయననే నమ్ముకోవాలి.

## చాటైన స్థలమునందు

మహోన్నతుని చాటున నివసించువాడే సర్వశక్తుని నీడను విశ్రమించు వాడు.

కీర్తనలు 91:1

కీర్తనకారుడు చెప్పుచున్నదేమనగా చాటైన స్థలములో నివసించువాడు సురక్షితముగా నుండును అని అర్థము.

చాటైన స్థలము అనగా దాగుకొనుటకు వీలైన స్థలము, లేక ఆశ్రయించదగిన స్థలము అని అర్థము. మనము బాధింపబడి అయోమయ స్థితిలో, సోలి

పోవుచున్నప్పుడు పరుగెత్తి దాగుకొనే స్థలమది. మనము అగౌరవ పరచబడినపుడు, శ్రమలపాలైనపుడు, గొప్ప అవసరతలోనున్నప్పుడు ఇక నేనేమాత్రము భరించలేకున్నాను అని అనుకునేటప్పుడు అట్టి స్థలానికి మనం పరుగెత్తి దాగుకుంటాము.

నేను చిన్నబిడ్డగా ఉన్నప్పుడు, మేము పెద్దగదులున్న ఇంటిలో నివసిస్తూ ఉండేవారము. మా అమ్మ ఆ గదులన్ని శుభ్రపరుస్తూ ఉండడాన్ని బట్టి ఆ ఇంటి అద్దె చెల్లించుకోగలిగేవారము. అది చాల అందమైన పెద్ద భవనము. చెక్కలతో మల్చబడి సుందరంగా కట్టబడిన భవనమది. దానిలో ఒక చాటైన స్థలముండేది. అది చెక్కలతో చేయబడి, గాజు తలుపులతో ఉన్న కిటికీలు అమర్చబడిన గదిగా ఆ స్థలముండేది. నేను చిన్నదానిగానుంటిని గనుక ఆ గదిలోని బెంచీ మీద కూర్చొని ఏదో ఏదో ఆలోచిస్తూ ఉండేదానను. దేనిని గురించి ఆలోచనసాగేదో నాకు జ్ఞాపకం లేదు. ఆ చిన్న వయస్సులో నాకు సమస్యలు బాధలు కూడా ఉండేవి.

మా కుటుంబ జీవితము అనేకమైన ఒడుదుడుకులతో, కుదిపివేసే పరిస్థితులతో నిండి ఉండేది. అయితే ఆ చాటైన స్థలము అప్పట్లో నాకు దాగు చోటుగా ఉండేది. నేను భయపడి, ఆదరణ అవసరమనుకున్నప్పుడు అక్కడ దాగుకునే దానను.

మనము చదువుకున్న బైబిలు వచనములో దేవుడు మనకు చాటైన స్థలముగా ఉండగోరుతున్నాడని చెబుతుంది.

కొందరు మద్యపానమును వారి చాటైన స్థలంగా చేసికొంటారు. మరికొందరు మాదక ద్రవ్యాలను, కొందరు టి.వి.ని వారి చాటైన స్థలంగా చేసికొంటారు. కొందరైతే కృంగిపోయి దుప్పట్లో తమ తల దూర్చి మిన్నకుంటారు. ఎంతోమంది ఎన్నో సంగతులను తమ చాటైన స్థలంగా ఉంచుకుంటారు.

మనము లోకమువైపు చూచి ఎక్కడ చాటైన స్థలమున్నదాయని వెతికేకంటే, దేవునినే మన చాటైన స్థలంగా చేసికోవాలని దేవుడు కోరుచున్నాడు. మహోన్నతుని చాటున నివసించుట అనగా దేవునినే మన ఆశ్రయంగా చేసికొనుట. మనకు సమస్యలు ఉత్పన్నమైనప్పుడు, కష్టములు కల్గినప్పుడు మనము ఆయన యొక్క రక్షించు రెక్కలక్రిందికి పరుగెత్తి రావలెనని, దేవుడు కోరుచున్నాడు.

## శత్రువు ఎదిరించలేని సర్వశక్తుని నీడ

మహోన్నతుని చాటున నివసించువాడే సర్వశక్తుని నీడను విశ్రమించువాడు. (అతడు కదలక నిలకడగా నుండును).

కీర్తనలు 91:1

మనము మహోన్నతుని చాటున నివసించినప్పుడు మనమెక్కడ ఉందుము? కీర్తనకారుడు చెప్పినదేమనగా మనము మహోన్నతుని చాటున నివసించినప్పుడు "సర్వశక్తుని నీడలో" ఉందుము. ఆ స్థలములోనే తన ప్రజలు నివసించాలని దేవుడు కోరుచున్నాడు.

ఎప్పుడో ఒకప్పుడు ఆయనను దర్శించాలని, మనం అయోమయంలో పడిపోయినప్పుడు మాత్రమే ఆయనయొద్దకు పరుగెత్తాలని దేవుని చిత్తము కాదు. అయితే మన పరలోకపు తండ్రి ఆయన రెక్కలక్రింద మనము నివసించాలని, అక్కడే జీవించాలని ఆయన కోరుచున్నాడు. ఆ విధంగా అక్కడ మనం ఉన్నప్పుడు మనం నిలకడగల వారంగా కదలని వారంగా ఉండగలము. ఎందుకనగా ఏ శత్రువు ఆయన యెదుటనిలువలేడు. ఆయన రెక్కలక్రింద మనమున్నప్పుడు సాతాను మనకు హానిచేయడు.

కొన్నిసార్లు దేవునియొద్దకు పరుగెత్తి ఆయన చాటైన స్థలములో ఉండి మరల బయటికి పరుగెత్తిన సంఘటనలు నా జీవితములో ఎన్నో గలవు. ఆ తరువాత

నేను ఆ చాటైన స్థలములోనే జీవించి అక్కడే నివసించే అనుభవం కల్గియున్నాను. కనుక అయోమయం అనేది నాకు లేదు.

మనకు దేవుడు నిత్యము అవసరమే. ఆయన అప్పుడప్పుడు మాత్రమే నాకు అవసరమని అనుకోకూడదు. యోహాను 15:5లో "నాకు వేరుగా నుండి (నాతో సంబంధం తెంచుకొని) మీరేమియు చేయలేరు" అని యేసు ప్రభువు చెప్పుచున్నాడు.

సర్వశక్తుని నీడను విశ్రమించుటయనగా అసలు అర్థమేమిటి? "నీడ" అనగా ఎండ వేడిమి నుండి కాపాడునది, లోకముయొక్క బాధలనుండి కాపాడునది అని అర్థము. నీడకు అంచులున్నట్లు మనకు తెలియును. దేవుని రెక్కల నీడ క్రింద మనము ఉండాలన్న ఉద్దేశ్యము గలవారమైతే, ఖచ్చితమైన అంచుల పరిధిలోనే ఉండవలసియున్నాము.

అంచు అనగా రెండు విలువలు, లేక పరిస్థితులను వేరుపరచుటకు అడ్డుగా నున్న కంచె అని అర్థము. ఒక నీడ యొక్క అంచు అనగా నీడ పరిధి అంతమైపోయి, ఎండ పరిధి ప్రారంభమైన స్థలము అని అర్థము.

మిట్టమధ్యాహ్న సమయంలో, సూర్య తేజస్సు మిరిమిట్లు గొలుపునప్పుడు, దగ్గరలోనున్న చెట్టు నీడ క్రిందికి పోయి నిలబడితే ఎంతో సుఖవంతమైన స్థితి అనుభవించగలము. ఎండలోనున్నప్పుడు అంత హాయి మనకుండదు.

ప్రజలు ఆరుబయట పనిచేయునప్పుడు ఎండకు చెమటోడ్చుచు, విరామ సమయంలో చెట్టు నీడ క్రిందికి వెళ్లగోరుదురు. కొందరు తమ ఇంటిచుట్టు చెట్లు నాటుకొని ఇంటిలో చల్లని వాతావరణం అనుభవింతురు. కనుక నీడ అనునది కోరదగిన విషయం. ఎండగానున్నప్పుడు నీడ ఎంతో అవసరం.

మనము దేవుని రెక్కల నీడలో నివసింపకోరినయెడల జీవితం ఎంతో సుఖదాయకంగా ఉంటుంది. అక్కడ వేడి, చెమట ఉండని స్థలము. మన సమస్యలను గురించి చింతించేకంటే, దేవునిలో విశ్రమించగలము.

మనము ఎండ వేడిమికి నిలువబడితే విసిగించ బడినవారముగా, చెమటపట్టి, దాహార్తి కలిగి, ఎండి పోతాము. మనలో ప్రతి ఒక్కరము నిర్ణయించుకోవలసిన విషయమేమనగా దేవుని నీడలో ఉందామా? (ఆయనను నమ్ముకొని యుందుమా?) లేక ఎండలో (చెమటోడ్చుచు) ఉందామా? అనగా యేసులో ఉందామా? లేక సమస్యలతో నిండిన లోకపు మాయలో ఉందామా?

నీవు ఎక్కడ ఉండుటకు నిర్ణయం తీసుకుంటావు? మనమందరము ఎన్నోసార్లు అలవాటుగా చేయునదేమనగా, నీడలో నిలబడకుండా, ఎటువంటి సుఖంలేని పరిస్థితులను కల్పించే ఎండలోనే ఉండగోరుతాము. ఇక తాళలేని పరిస్థితిలో మరలా నీడలోనికి ప్రవేశించి విశ్రమింపగోరుతాము. అయితే కొంత సేపయిన తరువాత మళ్లీ ఎండలోకి పోవాలనుకుంటాము.

రోమా 1:17లో మనము విశ్వాసము నుండి అంతకంతకు విశ్వాసము కల్గునట్లు జీవించాలని చెప్పబడింది. అయితే మనము విశ్వాసమునుండి అనుమానములోనికి, సందేహములోనికి, మళ్లీ విశ్వాసములోనికి అటూ ఇటూ తిరుగుతూ ఉంటాము.

మనము నిజముగా దేవుని నీడ యొక్క భద్రతలో నివసించగోరియు, కొన్నిసార్లు బయటికి వెళ్లే ప్రమాదములో ఉంటాము. మనము దేవుని నీడలో లేమని ఎట్లు తెలిసికోగలము? మనమార్గములో దేవుడుంచిన సూచికా స్తంభముల ద్వారా మనము ఆయన భద్రతలో ఉన్నామా లేదాయని తెలిసికోగలము.

# 2

# దేవునియందు నమ్మికయుంచి సూచికా స్తంభములను గమనించుము

నీవు రోడ్డుపైని ఏదైనా ఒక కారును నడుపుతున్నావని ఊహించుకొనుము. ఆ రోడ్డు అనగా జీవితపుబండి నడిచే మార్గమనుకోండి. కొన్నిసార్లు ఆ మార్గంలో పసుపురంగు గీతలు గీసి యుంటే, దాని అర్థమేమనగా, ఈ గీతలు దాటితే నీవు అపాయంలోకి పోతావు. వేరే కారును ఢీకొనే గొప్ప ప్రమాదస్థితి సంభవించవచ్చు అని దాని అర్థము.

కొన్నిచోట్ల మధ్యమధ్యలో ఖాళీలున్న తెల్లని గీతలుంటే అర్థమేమనగా నీవు ప్రక్కకు కూడా వెళ్లవచ్చు (నీకిష్టమయితే) అన్న సూచన అది. "ఈ గీత దాటినా ఫరవాలేదు. అయినప్పటికి వచ్చి పోయే బండ్లను గమనించుకోలేకపోతే ప్రమాదము" అని కూడా ఆ గీత సూచిస్తుంది.

రోడ్డు ప్రక్కనే కొన్ని ప్రమాద సంకేతాలు కూడా నిలువబెడతారు, అవి మనకు హెచ్చరికలిస్తూ ఉంటాయి. "జాగ్రత్తగా పొమ్ము", "రాళ్లు పైనుండి పడవచ్చు", "జంతువులు దాటు స్థలము", "ఒకే త్రోవ", "నిర్మాణములో నున్నది", "ముందు

రోడ్డు మలుపు తిరిగింది” అన్న సంకేతాలు మనం చూడగలము, ఈ రోడ్డు సంకేతాలను జాగ్రత్తగా గమనిస్తే, నీ కారు రోడ్డు మీద సురక్షితంగా ఉంటుంది. అప్పుడు నీవు ఇతర వాహనాలను ఢీకొనకుండా గుంటలో పడకుండా భద్రంగా ప్రయాణించగలవు.

అదేరీతిగా మన జీవితాల్లో కలిగే ఆత్మీయ సంకేతాలు మనం గమనించాలి. దేవుని కాపుదలలో మనం భద్రంగా ఉండుటకు ఈ సంకేతాలు “ఆయనను నమ్ముకొనుటయందు చింతింపకుండుటకు, భయపడక, దిగులు పడకుండుటకు, మన చింతయావత్తు ఆయనపై వేయుటకు సాయపడును.” అప్పుడే మనము సంగతులను పరిష్కరించుకొనుటకు అతిగా ఆలోచించము. ఏవి సత్యమైనవో, ఏవి యదార్థమైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతిగలవో, ఏవి మెప్పుకల్గించునవో, లేక ఏవి యోగ్యమైనవో వాటిని గూర్చి ఆలోచించెదము.

ఈ సంకేతాలను విలువైనవిగా ఎంచి, రోడ్డు యొక్క పరిధిలోనే జాగ్రత్తగా మన కారును నడిపినట్లయిన, మన ప్రయాణం సాఫీగా సాగుతుంది. అప్పుడే మనం భద్రపరచబడి, దేవుడు తన అద్భుతమైన వాక్యములో ఇచ్చిన వాగ్దానములు నెరవేరుట చూడగలము.

## సంకేతములను పరిగణలోనికి తీసికొనుము

“మీరు కుడి తట్టయినను, ఎడమ తట్టయినను తిరిగినను. ఇదే త్రోవ, దీనిలో నడుపుడి అని నీ వెనుకనుండి యొక శబ్దము నీ చెవులకు వినబడును.”

యెషయా 30:21

నీ జీవిత దారిలో నీవు కుడి చేతివైపు మాత్రమే కారు నడుపుతూ, కుదుపులు ఎక్కువైనట్లు గమనించావని ఊహించుకో. ఆ సమయంలోనే “చింతించవద్దు,

దేవునియందు నమ్మిక యుంచుము" అన్న సంకేతము నీకు కనబడినది. అయితే నీవు ఆ సంకేతమును లెక్కచేయక ఆలాగే ముందుకు కుడివైపునకు పోయి, అక్కడున్న గుంటలో పడిపోదువు.

మనం దేవుని నమ్ముకోకుండా చింతపడే స్థితిలోనే కొనసాగితే ఆలాగే గుంటలో పడిపోదుము. ఎందుకంటే చింతించుటవలన దేవుని కాపుదల లేక, శత్రువు మనపైకి వచ్చుటకు వీలు కల్పించిన వారమగుదుము. అప్పుడు తప్పక మన సమాధానం పోగొట్టుకొంటాము.

## సరాళముగానున్న చక్కని మార్గాలు

"మరియు కుంటికాలు బెణకక బాగుపడునిమిత్తము మీ పాదములకు మార్గములను సరళము చేసికొనుడి. (అవును, వాటిని భద్రమైనవిగాను, నేరుగానుండి సంతోషము కల్గించు సరియైన మార్గములుగా చేయుడి.)"

హెబ్రీయులకు 12:13

నీవు తప్పుడు నిర్ణయం చేసికొని, దేవునియందు విశ్వసించుటకంటే చింతించుటకే ప్రాధాన్యతనిస్తే, నీవు నెమ్మదిలేని వాడవైయుందువు. ఇక నుండి సంగతులు సరియైన విధానములో కొనసాగవనుకొందువు. కనుక త్రోవ తప్పిపోతినేయని చింతించెదవు.

నీవు సమాధానమును పోగొట్టుకున్న వెంటనే ఒక్క నిమిషము ఆగి "నేనేమి తప్పు చేశాను?" అని ఆలోచించుము.

కొన్నిసార్లు నేను మార్గములో పోవునప్పుడు, నా హృదయంలో సమాధానం పోగొట్టుకొందును. అప్పుడు నేను ఆగి, "ప్రభువా నేనేమి తప్పు చేశాను?" అని అడుగుతాను.

నా సమాధానం పోగొట్టుకుంటే నన్ను భద్రపరచే దేవుని రెక్కల పరిధిలో నుండి బయటికి వెళ్లిపోయానని తెలిసిపోతుంది.

నేను చింతించుటవల్ల ఆ విధంగా మార్గము తప్పిపోతాను. లేక వేరే ఎవరి విషయంలోనైన తప్పుగా ప్రవర్తించియుంటాను. కాని నా తప్పును తెలిసికొన్న దానను కాదేమో. అట్టి సమయాల్లో, "ప్రభువా నేను ఎందుకు నా సమాధానం పోగొట్టుకున్నాను. నేను నా సంగతులను సరిచేసికుంటాను" అని అడుగుతాను.

దేవుడు నీకు చూపించిన విధానములో నీవు నడచుకొనుచున్నప్పుడు, చింత పడుటయనునది నీపై దాడి చేసినట్లయితే, నీవు మత్తయి 6:25–32 వరకు పెద్దగా చదువవలెనని నీకు సలహా ఇస్తున్నాను.

## చింతించుట మానండి

"అందువలన నేను మీతో చెప్పునదేమనగా ఏమి తిందుమో, యేమి త్రాగుదుమో, అని మీ ప్రాణమును గూర్చియైనను, ఏమి ధరించుకొందుమో అని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి, ఆహారముకంటె ప్రాణమును, వస్త్రము కంటె దేహమును గొప్పవి కావా?"
మత్తయి 6:25

నీవు పథ్యము చేయుచుండినయెడల, పై వచనముయొక్క మొదటి భాగము మట్టుకు చదవండి. నీవు పథ్యము చేయువాడవైతే నా వలె ఎల్లప్పుడు తినుట త్రాగుటను గురించి మాత్రమే తలంచుచుందువు.

నేను పథ్యము చేయునప్పుడు, "ఏమి తినాలి? ఎప్పుడు తినాలి? ఎట్లు దానిని తయారు చేసికోవాలి?" అన్న చింత కల్గియుంటాను. అది ఎన్ని క్యాలరీలు ఉంటుందా అని మనస్సులో తలంచుకుంటాను. ఎప్పుడూ ఆహారమును గురించిన తలంపు కల్గియుంటాను గనుక నాకు ఎక్కువ ఆకలి అవుతుంది.

మనం ఏమి తినాలి, ఏమి త్రాగాలి అన్నవిషయానికంటే, ఫలాని పరిస్థితిలో ఏపని జరిగిస్తే బాగుంటుందని ఎక్కువ తలస్తూ ఉంటాము. ఒకవేళ ఇది ఇట్లు జరుగునేమో, లేక అలాగున జరుగునేమో అనుకుంటాము. మనలో చాలామందికి, కావలసినన్ని బట్టలు, ఆహారము, సుఖకరమైన ఇండ్లు, కార్లు ఉండియుండవచ్చు. అయితే పరిస్థితులు మన చేయిదాటిపోయినప్పుడు, "ఇప్పుడు నీవేమి చేయగలవు?" అన్న స్వరం మనలో నుండి వినబడుతుంది. ఆ స్వరం వినబడినప్పుడు చింతించుటకు ప్రారంభిస్తాము.

## ఆకాశ పక్షులను చూడండి

"ఆకాశపక్షులను చూడుడి; అవి విత్తవు, కోయవు, కొట్లలో కూర్చుకొనవు; అయినను మీ పరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు; మీరు వాటి కంటే బహుశ్రేష్ఠులు కారా?"

మత్తయి 6:26

ఒక చెట్టుపైన కూర్చున్న పిట్ట ఎంతో గుండె పగిలిన దిగులుతో నుండుట నీవు చూచావా? లేక ఒక పిట్ట వెనక్కు ముందుకు ఊగిసలాడుతూ, "తరువాత నేను తినడానికి ఏదైనా పురుగు దొరుకుతుందా?" అనుకోవడం మనం విన్నామా? "దేవుడు పురుగులను చేయడం మానుకుంటే నాగతి ఏమవుతుంది? ఆకలితో చస్తానే. ఒకవేళ పురుగులు దొరికినా, అవి ఇదివరకటివలే రుచిగా ఉంటాయా? ఒకవేళ ఆయన వర్షం కురిపించకపోతే, భూమిలోనుండి పురుగులు బయటికి రావుగదా? నేను నా గూడు కట్టుకోవడానికి తగిన గడ్డి దొరుకుతుందో లేదో!" అని పక్షి అనుకుంటుందా?

యేసు ప్రభువు ఇట్లు చెప్పాడు. "ఆకాశ పక్షులను చూడుడి." అవి దిగులుతో చతికిలబడవు. ప్రతిరోజు అవి ఉదయాన్నే ఎగురుతూ పాడుతూ తిరుగుతూ ఉంటాయి.

ఆ పక్షులను ఒక గంటసేపు మనం గమనిస్తే నీవు నేను ఎంతో నెమ్మదితో నింపబడతామని నేను అనుకుంటాను.

## చింతించుట వల్ల జరుగునది ఏమి?

"మీలో నెవడు చింతించుటవలన తన యెత్తు మూరెడెక్కువ చేసికొనగలడు?"

మత్తయి 6:27

పై ప్రశ్నకు జవాబు ఏమనగా, ఎవరునూ తమ ఎత్తును పెంచుకొనలేరు. అయితే ఎడతెగక చింతలో మునుగుటవలన మన ఆయుష్షును తగ్గించుకుంటాము.

మనం విచారించేకంటే ఆకాశ పక్షులవలె తమ పోషణవిషయమై దేవునిపై ఆధారపడే ఆకాశ పక్షులవలే దినమెల్ల పాడుచూ, రేపేమి సంభవించునో అన్న భయము లేకుంటే మంచిది కదా.

## అడవి పూవులను గూర్చి ఆలోచించండి

"వస్త్రములను గూర్చి మీరు చింతింపనేల? అడవిపువ్వులు ఏలాగు నెదుగుచున్నవో ఆలోచించుడి. అవి కష్టపడవు, ఒడకవు, అయినను తన సమస్త వైభవముతో కూడిన సొలొమోను సహితము వీటిలో నొకదానివలెనైనను అలంకరింపడలేదు. నేడుండి రేపు పొయ్యిలో వేయబడు అడవి గడ్డిని దేవుడీలాగు అలంకరించినయెడల. అల్పవిశ్వాసులారా మీకు మరి నిశ్చయముగా వస్త్రములు ధరింప జేయును గదా."

మత్తయి 6:28-30

పై వచనాలలో ప్రభువు చెప్పునదేమనగా అడవి పూవులు వాటంతట అవే అడవి పూవులుగా మారలేదు. దేవుడే వాటిని అందమైన రంగులతో అలంకరించాడు.

అడవి పూవులకంటే, పక్షులకంటే దేవుని దృష్టిలో మనము హీనమైన వారమని నీవు నిజంగా తలుస్తున్నావా?

## దేని విషయమై చింత పడకుడి

కాబట్టి—ఏమి తిందుమో యేమి త్రాగుదుమో యేమి ధరించు కొందుమో అని చింతింపకుడి. అన్యజనులు వీటన్నిటి విషయమై విచారింతురు. ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును.

మత్తయి 6:31,32

చింతించుట అనునది ఈ క్రింది ప్రశ్నలను లేవదీయును.

“మనకు తినడానికి ఏముంది? త్రాగడానికి మనకు ఏమి ఉంది? మనము ఏమి ధరించుకోబోతున్నాము?” అనగా “దేవుడు మనకు ఇవ్వకపోతే మనం ఏంచేద్దాము?” చింతించుటలో ఉన్న సమస్య ఇదే.

మన స్వంత మాటలే మనకు కోపాన్ని రేపును. మన భయాలను అణచివేసుకొనే బదులు, మన చింతలు తొలగించుకొనేబదులు, మన మాటలే మనలను లోతైన భయంలోనికి ఈడ్చుకొని పోతాయి.

ఆ విధంగా చేయుటవల్ల, పరలోకపు తండ్రి మనకున్నాడని తలంచని వారి జాబితాలో మనం కూడా చేరిపోతాము. కాని నిజంగా మనము పరలోకపు తండ్రిని నమ్ముచున్నాము గనుక అట్టి నిజమైన దేవుని బిడ్డలుగానే ప్రవర్తించాలి. అవిశ్వాసులకు దేవునిపై ఆధారపడుటెట్లో తెలియదు. మనం విశ్వాసులము గనుక ఆయనపై ఎట్లు ఆధారపడవలెనో ఎరిగియుండాలి.

మనకు కావలసినవన్ని మనం అడుగకముందే మన పరలోకపు తండ్రికి తెలియునని యేసు ప్రభువు చెప్పాడు. కనుక ఆ విషయాల గురించి మనమెందుకు చింతించాలి. అయితే మన దృష్టి వాటికంటే ఘనమైన విషయాలపై కేంద్రీకరించబడాలి. అనగా దేవుడు చేయమని మనకిచ్చిన పనుల విషయమై ఆలోచించాలి.

## మొదటిగా చేయవలసిన సంగతులను మనం వెదకాలి

"కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీ కనుగ్రహింపబడును."

మత్తయి 6:33

గతంలో ఎన్నో సంవత్సరాలుగా నేను సువార్త కూడికలలో ప్రసంగించుటకు ముందు, ఎంతో శ్రమపడి, "దేవా నాకు సాయం చేయండి" అని ప్రార్థించేదానను. దేవుని సాయంకోసం ప్రార్థించడంలో తప్పులేదు గాని, నేను ఎంతో చింతాక్రాంతురాలుగా ప్రార్థించేదానను. కాని విశ్వాసముండేది కాదు.

ఇప్పుడైతే నేను ప్రసంగించుట కొరకై సిద్ధపడునప్పుడు, నేను వాక్యము చదివి ఎంతో శ్రేష్టమైనరీతిలో సిద్ధపడతాను. ఆ తరువాత సువార్త కూడికకు ముందుగా కొద్ది సమయము మౌన ప్రార్థన చేసుకొంటాను, ధ్యానంలో ప్రభుని స్తుతించుటలో, ఆయనతో సహవాసములో గడుపుతాను.

పెద్దగా కూడిక జరిగించుమని గాని, ఎక్కువ చందా పోగుచేయుమనిగాని ప్రభువు ఎప్పుడు నాతో చెప్పలేదు. నేను ఆయన సముఖమును కోరుకుంటాను. అయనే ఎంత మంది కూడికకు రావాలో, ఎంత డబ్బు కానుకల రూపములో రావాలో అన్నవాటి విషయంలో ఆయనే జాగ్రత్త తీసికుంటాడు.

దేవుని సన్నిధిని వెదకినప్పుడు మనము ఆయన యొద్దనున్న చాటైన స్థలములో, ఆయన రెక్కలనీడలో ఉండగలము. (ఆయన రెక్కలక్రింద నీకు ఆశ్రయము కలుగును.)

“ఆయన తన రెక్కలతో నిన్ను కప్పును ఆయన రెక్కల క్రింద నీకు ఆశ్రయము కలుగును. ఆయన సత్యము, కేడెమును, డాలునై యున్నది.” (కీర్తనలు 91:4).

కాని మనలను ఎదిరించే సమస్యలకు, పరిస్థితులకు కావలసిన జవాబులను మన కోరికలను తీర్చుకొనుటకు మాత్రమే వెదకినయెడల, అనగా దేవుని చిత్తమును ఎరుగకుండా ఉండినయెడల, మనము ఆయన రెక్కలనీడ నుండి బయటికి వెళ్లిపోవుదుము.

కొన్ని సంవత్సరాలుగా నా పరిచర్య ఎట్లు వృద్ధి పరచబడగలదని ప్రభువును అడిగాను. అయితే దాని ఫలితమేమనగా నా పరిచర్యలో ఏమి ఎదుగుదల లేక యధాతధాగా ఉండిపోయింది. నేను మరచిన విషయమేమనగా నేను మొదట దేవుని రాజ్యవిస్తరణ కోరాలి అని, అప్పుడే ఆయన తగిన అభివృద్ధిని విస్తరణను దయచేయును.

నీ స్వంత ఆత్మీయ జీవితంలో ఏవిధంగా ఎదగాలన్న దానిని గురించి నీవు చింతపడనక్కరలేదని నీవు గ్రహించావా? దేవుని రాజ్యమును వెదకుటయే నీవు చేయవలసిన పని. అప్పుడు నీవు ఎదుగుదువు. దేవుని వెదకుము ఆయనలో నిలిచియుండుము. ఆయనే అభివృద్ధిని ఎదుగుదలను అనుగ్రహించును.

ఒక చిన్నబిడ్డ పాలు త్రాగి ఎదుగుతుంది. నీవు, నేను చేయవలసినదేమనగా వాక్యము అను పాలను యదార్థంగా త్రాగాలి. అప్పుడే మనము ఎదుగగలము. (1 పేతురు 2:2)

మన స్వంత మానవ ప్రయత్నము ద్వారా మనమేమి సాధించలేము. దానికి బదులు దేవుని రాజ్యమును నీతిని మనము మొదట వెదకాలి. ఆ తరువాత మనకు అక్కరగానున్నవన్ని ఆయన మనకు దయచేస్తాడు.

మనము ఆయన ఈవులను వెదకకూడదు. కాని ఆయన సన్నిధిని వెదకాలి.

## ఆయన నీడలో నీ సమయముగడుపుట ఎట్లు?

“యెహోవాయొద్ద ఒక్క వరము అడిగితిని. దానిని నేను వెదకుచున్నాను. యెహోవా ప్రసన్నతను చూచుటకును ఆయన ఆలయములో ధ్యానించుటకును నా జీవితకాలమంతయు నేను యెహోవా మందిరములో నివసింప గోరుచున్నాను. ఆపత్కాలమున ఆయన తన పర్ణశాలలోనన్ను దాచును తన గుడారపు మాటున నన్ను దాచును. ఆశ్రయదుర్గము మీద ఆయన నన్ను ఎక్కించును. ఇప్పుడు నన్ను చుట్టుకొనియున్న నా శత్రువుల కంటె ఎత్తుగా నా తలయెత్తబడును ఆయన గుడారములో నేను ఉత్సాహధ్వని చేయుచు బలులు అర్పించెదను. నేను పాడెదను. యెహోవానుగూర్చి స్తుతిగానము చేసెదను.”

కీర్తనలు 27:4-6

కొన్నిసార్లు మనం ఆత్మీయ జీవితంలో వెనక్కి నడవడానికి ప్రారంభిస్తాము. కొన్ని సంవత్సరాలకు ముందు నేను అట్లుండేదానను. గొప్ప పరిచర్య కావాలని, నాలో అనేక మార్పులు రావాలని, నా భర్త ఫలాన రీతిగా మారాలని, నా పిల్లలలో మార్పురావాలని, నా వలన స్వస్థత జరగాలని, నాకు డబ్బు విషయంలో ఐశ్వర్యంగలగాలని వెతికేదానను. సూర్యుని క్రింద లోకంలో ఉన్నవాటన్నిటిని కావాలని కోరుకునేదానను. అయితే ఆయన రెక్కల క్రింద సమయం గడపలేకపోయాను.

ఆ తరువాత దేవుడే నా పరిస్థితిలోనికి అడుగిడి నా తప్పును నాకు చూపించాడు. కీర్తనలు 27:4-6 వచనాలను నాకు చూపి, నేను మొదటిగా

ఆయనను, ఆయన సన్నిధిని నా జీవితకాలమంతా వెదకవలెనని నాకు బోధించాడు.

దేవుని సన్నిధితో సంబంధంలేని అనేక విషయాలను గూర్చి నేను వెదకుచూ వచ్చాను. తరువాత నేను ఆయనను ఎక్కువగా వెదకుటకు ప్రారంభించాను. ఆ తరువాత కష్టములు వచ్చినపుడు ఆయన నన్ను తన పర్ణశాలలోని చాటైన స్థలములో దాచియుంచాడు. శత్రువు నన్ను నాశనము చేయుటకు నాపైకి ఎగసినప్పుడు, నేను నా గొంతెత్తి ప్రభువును స్తుతించి సంతోషించి కీర్తనలు పాడాను.

నేను మహోన్నతుని చాటైన స్థలములో దాచబడ్డాను గనుక సాతాను నన్ను చేరుకోలేకపోయాడు. నేను అతనికి అందుబాటులో లేను. నేను ఆయన నీడలో ఉండి దేనివిషయం చింతలేని దానిగా నుండుట వల్ల సాతాను నా దేహములో అకస్మాత్తుగా కలుగు అనారోగ్యమేది తీసికొనిరాలేకపోయాడు.

## దేని విషయమై చింతపడకుడి

> "దేనిని గూర్చి చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనముల చేత కృతజ్ఞతా పూర్వకముగా మీ విన్నపములను దేవునికి తెలియజేయండి. అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసు క్రీస్తు వలన మీ హృదయములకును మీ తలంపులకును కావలియుండును."
>
> ఫిలిప్పీయులకు 4:6–7

చాలాకాలము క్రిందట నేను ప్రభువుయొద్దకు వచ్చినప్పుడు, ఆయన నాతో చెప్పినదేమనగా సాతాను నాకిచ్చుటకు ప్రయత్నించిన ప్రతిదానిని ఆయనకు నేనివ్వాలని కోరినాడు.

ప్రార్థన అనగా అదే, సాతాను మనయొద్దకు వచ్చి మనకు ఒక సమస్య తెచ్చిపెట్టాలని కోరును. అయితే మనము ఈ సమస్య నాకు భారమైనది గనుక దాని మోసికొని పోలేను. ప్రభువా! ఇదిగో దీనిని నీకిచ్చుచున్నానని చెప్పి ఆ సమస్యను ఆయనకు అప్పగించాలి.

ఫిలిప్పీ 4:6,7లో అపోస్తలుడైన పౌలు క్లుప్తంగా చెప్పినదాని సారాంశ మేదనగా "ప్రార్థించి, చింతపడకుండా ఉండుము", అని అర్థము. ప్రార్థించిన తరువాత చింతపడుమని ఆయన చెప్పలేదు. మనము ప్రార్థించి మన సమస్యను ఆయనకిచ్చినప్పుడు, మనము ఆయనయందు నమ్మకముంచామన్న దానికి అది గుర్తుగా నుండును. ప్రార్థనయొక్క అర్థము అదే.

నా కుమారుడైన డానీ పిన్న వయస్సులో ఉన్నప్పుడు నేను ఈ విధముగా చేయవలసి వచ్చేది. మా పరిచర్య సేవ నిమిత్తము మేము ప్రయాణాలు చేయవలసినప్పుడు ఆ బిడ్డను మాతో రాకుండా ఇంటివద్ద వదలి వేసినప్పుడు, నాలో వేదనగా ఉండేది. అతడు కళాశాల చదువులకు పోకమునుపు తన ఉన్నత పాఠశాలలో కల్గిన సమస్యలవల్ల తల్లిదండ్రులమైన మేము దగ్గర లేకపోవడం అతనికి సమస్యగా మారిందని మాకు ఫోను చేసి చెప్పాడు. ఉదయం లేచినప్పుడు, రాత్రి పడుకొనేప్పుడు అతడు మమ్ములను గూర్చి ఆలోచించేవాడు.

నేను, నా భర్త డేవ్ కొన్ని సంవత్సరాలుగా మా కుమారునితో మంచి స్నేహ బాంధవ్యం పెంచుకున్నాము. అతడు మమ్ములను ప్రేమించేవాడు, మేము అతనిని ప్రేమించాము. (అతని తరువాతి పిల్లవాడు 10 సంవత్సరాల వయస్సు గలవాడు) దేవుడు డానీని మాతో ఉంచుకొమ్మని చెప్పినప్పుడు అతని తరువాతి పిల్లవాడు హైస్కూలులో ఉండి, అక్కడ ఒత్తిడిలు, ఎదుర్కొంటూ ఉండడం మాకు సమస్యగానే ఉన్నది.

ఆ విధంగా మేమందరము అనుదినము అనేక సవాళ్లు ఎదుర్కొనవలసి వచ్చింది. మమ్మును గురించి మేము మదనపడే ఉరిలో పడుతూ, అన్ని సంగతులు

జరుగవలసినంత చక్కగా జరుగకపోవుట చూచి, తలదించుకొన్న వారమై సంచరించవలసి వచ్చెను. ఇప్పుడు మా దృక్పథం మార్చుకోవాలనుకొన్నాము. మేము ప్రార్థనాపరులమై యుండాలనుకున్నాము.

డాని నుండి దూరంగా ఉన్నాము గనుక మా పరిచర్యలో అతనిగురించి ప్రార్థించేవారము.

*"తండ్రీ డాని గురించి మీరు తగిన జాగ్రత్త తీసికొనుచున్నారు గనుక నీకు వందనములు. ప్రభువా అతని జీవితం విషయము మీకొక ప్రణాళికయున్నది. గనుక వందనములు. మీరు ఆయనను కాపుకాయుచు, అతని క్షేమము నిమిత్తము సమస్తము చేయుచున్నారు కనుక వందనములు. నీ కుమారుడైన యేసు రక్తముతో అతడు కప్పబడియున్నాడు."*

నీవు గాని నేను గాని ఆ విధంగా ప్రార్థించినప్పుడు సాతాను మనలను వదలిపోతాడు. దేవుడు మనలను కదలకుండా భద్రంగా ఉంచును. ఎందుకనగా మనము ఆయనను నమ్ముకున్నాము.

## అనుకూలమైన మనస్సు కల్గియుండుము

"అయితే అతడు ఏమాత్రమును సందేహింపక విశ్వాసముతో అడగవలెను. సందేహించువాడు గాలిచేత రేపబడి యెగిరిపడు సముద్రతరంగములను పోలియుండును.

అట్టి మనుష్యుడు ద్విమనస్కుడై, తన సమస్త మార్గముల యందు అస్థిరుడు గనుక ప్రభువువలన అతనికేమైనను దొరుకునని తలంచుకొనరాదు."

యాకోబు 1:6,7

మనకు భారముగానున్న సంగతులు ప్రార్థనలో ప్రభువుకిచ్చిన తరువాత వాటి విషయమై చింతపడుతూ ఉంటే మనము అనుకూలతను, అనానుకూలతను రెంటిని కలుపుతున్నాము. ప్రార్థన అనుకూలమైన శక్తి. చింతించుట విరుద్ధమైన శక్తి వాటిని కలిపినప్పుడు, మనకు ‘0’ అనుభవము వచ్చును.

నీ విషయం నాకు తెలియదు గాని నామట్టుకైతే నేను శక్తిలేని దాననుగా నుండుటకు ఇష్టపడను. కనుక ప్రార్థనను చింతను రెంటిని కలిపి ఉంచుటకు ఇష్టపడను.

ఒకసారి దేవుడు నాతో మాటలాడి ఈలాగున అన్నాడు. చాలామంది “సున్నా” శక్తి గల్గి ప్రవర్తిస్తారు. కారణమేమనగా వారు అనుకూలమైన శక్తిని దానికి వ్యతిరేకమైన విరుద్ధ శక్తిని కలిపి ప్రార్థిస్తారు. కొంతసేపు అనూకూలమైన మనస్సుతో ప్రభువును ఒప్పుకుంటారు. మరికొంతసేపు విరుద్ధ భావములతో ఉంటారు. కొంతసేపు ప్రార్థిస్తారు, కొంతసేపు విచారముతో నిండియుంటారు. కొంతసేపు విశ్వాసము కల్గి, మరికొంత సేపు చింతించుచూ కాలం గడుపుతారు. ఆ విధంగా ఆత్మీయ జీవితంలో ముందుకు, వెనక్కు కదులుతారు గాని విశ్వాసంలో ముందుకు సాగిపోరు.

దేవునియందు నమ్మకముంచుటకు, అనుకూలంగా ప్రవర్తించుటకు చింతించకుండుటకు నీవు ఎందుకు నిర్ణయం తీసికోకూడదు?

# 3

# అన్ని పరిస్థితులు సాఫీగానే సాగిపోవును

రెండవ సంకేతము, ఏమి జరుగునోయని దిగులుపడుట, లేక విచారించుట. “భయపడకుము, దిగులు పడకుము.” మొదటి సంకేతమువలె ఈ రెండవ సంకేతము కూడా ఒక హెచ్చరికతో కూడిన సందేశం కలిగియున్నది. “దేవునియందు విశ్వాసముంచుము, చింతించవద్దు.” ఈ ఆజ్ఞను ఉల్లంఘించుట వలన కలుగు పర్యవసానము భయంకరముగా నుండును. గుంటలో పడిపోవు ప్రమాదము తప్పించుకోవాలని, కుడిచేతివైపు నీ బండి పోతుంటే మరో వాహనానికి ఢీ కొట్టుట ఖాయమైనట్లే. అనగా మలుపు తిరుగునప్పుడు పసుపు పచ్చని రెండు గీతలను దాటినట్లుండును.

చింతించు లక్షణమువలే కాక విచారించు దిగులుపడు లక్షణమును నివారించిన పిదప కూడా అది మనలో మెదులుతూనే ఉంటుంది. చింతించుటను రెండింతలు చేస్తే ఈ (దిగులు) విచారము అనేది ఉనికిలోనికి వస్తుంది. ఈ విచారము నడుపు మార్గములో మనము పయనించినట్లయిన, విశ్వాసము

లేనివారమై రేపటిని గురించి, తరువాత ఏమి జరుగునోయన్న భయముతో నిండుకొందుము. దీనినే దిగులు అని మనం పిలుస్తాము.

## దిగులు యొక్క సంకేతము

"ఒకని హృదయములోని విచారము దాని క్రుంగ జేయును. దయగల మాట దాని సంతోషపెట్టును."

సామెతలు 12:25

జీవితంలో దిగులు భరించలేనిదిగా నుండును.

వెబ్‌స్టర్ నిఘంటువు నందు దిగులు, విచారము అనగా "సుళువుగా లేని స్థితియని," "సందిగ్ద స్థితి" అని, "చింతించుట" అని చెప్పబడింది. సుళువుగా ఉండని స్థితి అనగా అయోమయంగా ఉండి మన దుఃఖమునకు ఫలాని కారణమని చెప్పలేని స్థితి అని అర్ధము. దిగులుగానున్నది అన్న విషయాన్ని అర్ధం చేసుకోవడం కూడా కష్టమే. దిగులుగా నున్నప్పుడు మనము నెమ్మదిలేని స్థితిలో ఉండి, ఇతరులతో కలిసి ఉందామన్న మనస్సు కలిగియుంటాము.

వెబ్‌స్టర్ దీనిని గురించి వర్ణిస్తూ సందిగ్ద స్థితి అనగా "ఏదో భయంకరమైన విషయం జరుగుతుందేమో అని ఎదురు చూచుట'' అన్నాడు. ఏదో జరుగబోతుందని ఎదురు చూడడము దిగులు యొక్క విపరీతమైన స్థితి అని చెప్పవచ్చును.

ఒకప్పుడు నాకు కల్గిన దిగులును బట్టి, అనేకమైన చెడుపరిణామాలను ఎదుర్కొనవలసి వచ్చింది. అప్పుడు ఏదో దుష్టపరిస్థితి రాబోతుందని ఎదురు చూచాను. అట్లు దేని కొరకు నేను ఎదురు చూస్తున్నానో నాకే తెలియలేదు. అయితే దాని విషయమైన సంజాయిషీ ప్రభువు నాకు చూపించాడు.

## దుష్ట పరిణామములు కలుగునేమోనన్న ఎదురు చూపులు

"బాధపడువాని దినములన్నియు శ్రమకరములు; సంతోష హృదయునికి నిత్యము విందు కలుగును."

సామెతలు 15:15

కొన్నిసంవత్సరాల క్రిందట, ఒక రోజు ఉదయం నేను అద్దం దగ్గర నిలుచుండి నా తలవెంట్రుకలు సరిచేసికొంటున్నాను. అప్పుడు నాకేదో చెడు జరుగబోతుందన్న భావన నాలో కల్గింది. ఆ భావన నాకు ఎందుకు కల్గిందో అర్థంకాలేదు. అప్పటికి కొద్దికాలం క్రితమే నేను పరిశుద్ధాత్మతో నింపబడిన అనుభవం కలిగియుంటిని. నన్నెవరో భయపెడుతున్నారన్న భావన నాకు కల్గడం అదే మొదటిసారి.

అందువల్ల దాని విషయం ప్రభువునొద్ద తెలిసుకొందామని, "ప్రభువా, ఎడతెగక నాచుట్టు బరువుగానున్న ఈ భావన ఏమిటి? ఇది ఎంతో కాలంగా నన్ను వేధిస్తుంది." అన్నాను. అందుకు ప్రభువు దానిని "చెడు జరుగునన్న భావన" అని చెప్పాడు.

చెడు ఏదో జరుగుతుందన్న భావన వస్తున్నప్పటికి, ఆ భావన కలుగుచున్న సమయానికి మాత్రం అంతా సవ్యంగానే యుండినది. ఏదో ఒక చెడు తొందరలో జరుగబోతుందన్న భావన మట్టుకు నాకు బలమైనరీతిగా కలుగుతుంది.

ఆ సమయంలో, చెడు జరుగునన్న భావనకు సంబంధించిన మాట బైబిలులో నున్నదని నాకు తెలియదు. సామెతలు 15:15లో ఈ మాటలు వ్రాయబడి యుండుట నేను చూచాను. "బాధపడువాని దినములన్నియు" అన్న మాటలు ఆంప్లిఫైడ్ బైబిలులో "దిగులుతో నున్న దినములు" అని "చెడు జరుగునన్న భావనగల దినములని" వ్రాయబడ్డవి.

మన జీవితంలో సంతోషంగా ఉండాలంటే మన దిగులు విచారములనుండి మనం విడుదల పొందాలి. కాని అట్లు దిగులు నుండి విడుదల పొందాలని

చెప్పడం సులువే గాని, దానిని వదలివేయడం ఎంతో కష్టం. ఎందుకంటే మన విరోధియైన సాతాను, మనము దిగులు నుండి విడుదల పొందకుండునట్లు తన సాయశక్తులా ప్రయాసపడతాడు. మన విషయంలో ఇతరులు ఎల్లప్పుడు తప్పుడు ఆలోచనలే కల్గి ఉంటారని, మనలను మెచ్చుకోరని, మనమంటే ఇష్టపడరని, మనలను గురించి పట్టించుకోరని సాతాను ఎప్పుడూ చెబుతూనే యుంటాడు. ఇదివరకు జరిగిన విషయాలను గురించి మనం సిగ్గుపడాలని, ప్రస్తుతం ఎవరునూ మన సహాయానికి రారని ఇక భవిష్యత్తులో మనం ఎదురు చూడవలసిన మంచి ఏదియు లేదని మనం నమ్మేటట్లు చేస్తాడు. దేవునితో మనం సహవాసం కోల్పోయి, ఆయన మనకిచ్చిన పని చేయలేనంతగా మనపై దిగులు విచారములను మనపై మోపుతాడు.

దిగులు అన్న మాటయొక్క అర్థాలు, అనగా "చింతించుట", "అనుకున్నవి జరుగవన్న" ఆలోచనలు పై విషయాలు నిర్ధారిస్తాయి.

## నీవు నిజంగా విమోచించబడినవాడవైతే, దానిని గురించి ఖరారుగా చెప్పుము.

> "యెహోవా విమోచించినవారు ఆ మాట పలుకుదురు గాక విరోధుల చేతిలోనుండి ఆయన విమోచించిన వారును…ఆ మాట పలుకుదురు గాక."
>
> కీర్తనలు 107:2

సాతాను నీ గమనాన్ని మళ్లించుటకు ప్రయత్నిస్తున్నాడని నీకు తెలిస్తే, ఒకచోట మౌనంగా కూర్చుండి సాతాను తెచ్చే విరుద్ధమైన తలంపులతో నిండి, వాని చేకొట్టబడుటకు వీలు కలుగనియ్యవద్దు. నీవు నోరు తెరచి సాతానుకు ఇష్టం పుట్టించని మాటలు పలికితే, అతడు వెళ్లిపోతాడు. యేసు క్రీస్తులో నీకున్న అధికారాన్నిగూర్చి నోటితో పెద్దగా చెప్పుము.

కొన్నిసార్లు ఒక ప్రార్థనా మందిరంలోనో, సభలోనో మాటలాడడానికి నేను సిద్ధపాటులో నున్నప్పుడు సాతాను అనేకమైన విరుద్ధమైన తలంపులతో నన్ను తికమక పరుస్తాడు.

నేను నడిపించవలసిన ఒక స్త్రీల కూటమునకు హాజరగుటకు ఎంతమంది ముందుగా స్త్రీలు అంగీకారమును వ్రాసి పంపారని నా సహాయకురాలిని అడిగాను. అందుకామె బహు కొద్దిమంది మాత్రమే తమ అంగీకారమును తెలుపుతూ ఉత్తరము వ్రాశారని, అయితే ఆ కూటమును ఏర్పాటు చేసినవారు, పోయిన సంవత్సరం వచ్చినంత మంది వస్తారని అనుకుంటున్నారని చెప్పింది.

ఆమె ఆ మాటలు చెబుతుండగా అకస్మాత్తుగా ఈ తలంపులు నాకు కల్గినవి. "ఒకవేళ ఆ కూడికకు ఎవరూ రాకపోతే ఏమి చేయాలి?" నేను, మాతో కలసి పనిచేయువారము ఇంతదూరం పనిగట్టుకొని వస్తే, కొద్దిమంది మాత్రమే మాయొద్దకు వస్తే ఏమి లాభము? ఈ ప్రశ్నలకు నేను ఒకే సమాధానం పెద్దగా చెప్పాను. "అన్ని సవ్యంగానే జరుగును", అన్నాను.

కొన్నిసార్లు ఆ విధంగా చెప్పకపోతే, ఆ దుష్టతలంపులు మనస్సులో మెదులుతూ మనలను దిగులుతో నింపివేస్తాయి. సాతాను వాటిని మన మనస్సులో నాటి, మనలను తికమక పెడతాడు. ఆ తలంపుల ప్రకారం మనం ప్రవర్తించి, పాడు చేయుటకు తలంచే దుష్టత్వం మన మధ్య జరగాలని వాని కోరిక.

మన మాటలకు ఆత్మీయమైన విషయాల్లో సృజనాత్మకమైన శక్తి ఉంటుంది. ఆదికాండము 1:3లో దేవుడు, "కలుగును గాక" అని పలుకగా ...ఆ ప్రకారమాయెను.

యేసు ప్రభువు, "కాబట్టి—ఏమి తిందుమో, యేమి త్రాగుదుమో, యేమి ధరించుకొందుమో అని చింతింపకుడి" (మత్తయి 6:31) మనం విరుద్ధమైన తలంపులు కలిగి ఆ విధంగా మన నోటితో పలికితే, మనకు నిజమైన సమస్యలు

రావడానికి ఎక్కువ కాలం పట్టదు. “రేపటినిగూర్చి చింతింపకుడి. రేపటి దినము దాని సంగతులనుగూర్చి చింతించును.” (మత్తయి 6:34).

## మీ జీవితమును సంతోషంతో జీవించండి

> “సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణమును అక్షయాలంకారము గల మీ హృదయపు అంతరంగ స్వభావము మీకు అలంకారముగా ఉండవలెను; అది దేవుని దృష్టికి మిగుల విలువగలది.”
>
> 1 పేతురు 3:4

దిగులు అన్న మాటకు “అతిగా జాగ్రత్త కల్గియుండుట” “నెమ్మది లేకుండుట” “మనస్సులో వేదించబడుట” అన్న అర్థాలుకూడా ఉన్నవి. మనం సమాధాన కరమైన మనస్సు కల్గియుండవలెనని దేవుడు కోరుచున్నాడని పేతురు మనతో చెప్పుచున్నాడు. మనము దిగులుతో దిగజారిపోవుట ఆయనకిష్టము కాదు.

మనం దిగులుతో దిగజారితే మన కడుపులో ఏదో భారమున్నదన్న వేదనకరమైన అనుభూతి కలుగుతుంది. అన్ని విషయాలు భారముతో నిండినట్లు అనిపిస్తుంది. ఎన్నో తప్పులతో నిండిన తీవ్రమైన స్థితిలో మనమున్నామన్న తలంపు మనలో కల్గుతుంది. అందువల్ల దేవుడు కోరే స్వేచ్ఛగల సంతోషకరమైన జీవితం జీవించలేము.

నా విషయానికొస్తే, నా బాల్యం ఎంతో తీవ్రమైన వేదనలకు గురియైనదగుట వలన. అంత చిన్నతనంలోనే పెద్దవారివలె ప్రవర్తించేదానను. నాకు కల్గిన వేదనలను మరచిపోయి చిన్నబిడ్డ వలె ప్రవర్తించుటకు నాకు శక్తి ఉండేదికాదు. దానిని బట్టి, నాకు పెండ్లి అయ్యి పిల్లలు కల్గిన తరువాత, నా పిల్లలతో సంతోషకరమైన సమయం గడపలేక పోయాను. చాలాసంవత్సరాలుగా నా భర్త విషయంలో కూడా సరియైన గమనిక లేక ఆయన నా మనస్తత్వానికి అనుగుణ్యంగా మారాలని ఎదురు చూచాను.

నా పిల్లలతో సంతోషంగా ఉండలేక, ప్రతి ఉదయం వారు బడికి వెళ్లేప్పుడు వారు తల చక్కగా దువ్వుకున్నారా లేదా, వాళ్ల బట్టలు ఇస్త్రి చక్కగా ఉందాలేదా, వాళ్లు మధ్యాహ్న భోజనం తీసుకు వెళ్లే టిఫిను డబ్బా మూత గట్టిగా ఉందా లేదా అని వాటి విషయమై శ్రద్ధ తీసుకునే దానను. నాపిల్లలంటే నాకు ప్రేమ ఉంది. కాని వారితో సంతోషంగా కాలం గడపలేక పోయేదానను.

మాకొక మంచి ఇల్లుండేది దానిని ఎంతో శుభ్రంగా ఉంచే దానను. ప్రతి వస్తువును దాని దాని స్థలములో ఉంచేదానను. కాని నాకు ఇల్లు ఉన్నదన్న సంతోషము ఏ మాత్రము నాకు లేదు. ఎవరిని ఆ యింటిలో సంతోషంగా ఉండడానికి ఒప్పుకొనేదానను కాను.

నా పిల్లలకు ఆటవస్తువులుండేవి. అయితే వారు సంతోషంగా వాటిని ఉపయోగిస్తే నేను ఇష్టపడేదానను కాను.

తమాషాగా నవ్వుతూ ఉండడం అంటే ఏమిటో నాకు తెలిసేది కాదు. సంతోషకరమైన సంగతులకు మాకుటుంబం అనర్హమైంది అనుకున్నాను. సంతోషంగా ఉండనక్కరలేదు. మనం దినంలో ఎంత పనిచేయాలో అంతే చాలునని అనుకునేదానను.

“మీరు బయటికి వెళ్లి ఆడుకోండి” అని నా పిల్లలతో చెప్పేదానను. వారు వెళ్లి ఆట మొదలు పెట్టకముందే “మీరంతా రోత చేస్తారు, మీరందరు లోపలికి రండి” అని చెప్పే దానను. అ దినాలలో నాకు తెలిసిందల్లా ఒక్కటే, నా అభిరుచికి అనుగుణ్యంగా వారు ప్రవర్తించకపోతే, లోకాంతం అవుతుంది అనుకునేదానను. అయితే హాయిగా ఉండి, సంతోషించడం నేను నేర్చుకోలేదు.

కీర్తనలు 118:24లో ఈ విధంగా చెప్పబడింది. “ఇది యెహోవా ఏర్పాటు చేసిన దినము దీనియందు మనము ఉత్సహించి సంతోషించెదము.”

యోహాను 16:33లో, "నాయందు మీకు సమాధానము కలుగునట్లు ఈ మాటలు మీతో చెప్పుచున్నాను. లోకములో మీకు శ్రమకలుగును. అయినను ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించియున్నాను."

ఫిలిప్పీయులకు 4:4 "ఎల్లప్పుడును ప్రభువునందు ఆనందించుడి, మరల చెప్పెదును ఆనందించుడి" అని వ్రాయబడింది.

కనుక తీవ్రమైన మనస్తత్వం కల్గియుండవద్దు. సంతోషంగా ఉండండి. దేవుడు తన పని జరిగించునట్లు ఆయనకు తరుణమివ్వండి. ఈ జీవితంలో నీవు అనందంగా ఉండాలని తీర్మానించుకొనండి.

## మహిమ నుండి మహిమకు మార్చబడండి

"మనమందరమును ముసుకు లేని ముఖముతో ప్రభువుయొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింపజేయుచు, మహిమనుండి అధిక మహిమను పొందుచు, ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము."

2 కొరింథీయులకు 3:18

అంతా సవ్యంగా, చక్కగా ఉంటేనే నేను సంతోషిస్తాను అని నీవనుకొను చున్నావు. అవునా? అయితే నీవు ఎన్నడూ సంతోషంగా ఉండలేవు. "నేను అన్ని విషయాల్లో పరిపూర్ణుడుగా ఉండి, నా చుట్టూ ఉన్నవారు కూడా పరిపూర్ణంగా ఉండినప్పుడే నేను ఆనందించగలను," అని నీవు తలంచుకొనుచున్నావా? అయితే అట్లు తలంచడం పెద్ద పొరబాటే.

నీవు నేను, దేవునియొక్క స్వంత రూపములోనికి మార్చబడుచు మహిమ నుండి అధిక మహిమకు పోవుచున్నామని బైబిలు చెప్పుచున్నది. దాని అర్థమేమనగా, మనము వివిధ దశలగుండా పోవుచున్నాము. కనుక ప్రతి దశలోని

పరిస్థితులను మనము అనుభవించాలి. ప్రస్తుతము ఏదశలో ఉన్నామో దానిలోని మహిమను మనమెట్లు అనుభవించవలెనో నేర్చుకొనుచు మరియొక దశలోనికి వెళ్లవలసియున్నాము. "నేను ఎక్కడ ఉండవలెనో అక్కడ ఇంకా లేను, మరియు ఇదివరకు నేనున్న దశలో నుండి దాని తరువాతి దశలోకి ప్రవేశించాను. అందును బట్టి దేవునికి స్తోత్రము" నేను వెళ్లే ప్రతిదశలో నేను ఆనందించగలను అని మనం చెప్పాలి.

మా పిల్లలు చంటి బిడ్డలుగా ఉన్నప్పుడు భలే తమాషాగా ఉండేవారు. చిరునవ్వు చిందిస్తూ, 'ఊ, ఊ' అని శబ్దాలు చేసేవారు. మధ్యరాత్రిలో ఏడ్చేవారు, వారికి దంతములు కలిగేప్పుడు విరేచనాలతో బాధపడేవారు. వారు ఆ దశకు వచ్చినందుకు మేము సంతోషపడేవారము. వాళ్లు కే.జీ.క్లాసుకు వచ్చినప్పుడు ఆ దశ విషయం ఆనందిచేవారము.

ప్రాథమిక పాఠశాల తరువాత, నా పిల్లలు హైస్కూలుకు వెళతారని గర్వపడుచు ఆనందించేవారము. ఆ దశ అయిపోగానే వారు వివాహితులౌతారని ఆదశను బట్టి ఆనందించేవారము.

ఆ దశలోనికి వారు అడుగిడగానే ఆయా దశలగుండా వెళ్లడం జ్ఞాపకం చేసికొని వారు వివిధ దశలలో ఉన్నప్పుడు ఆ సమయాలనుబట్టి మేము ఆనందించలేదనుకునే వారము.

ఆ విధంగా, నా జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఆయా దశలను జ్ఞాపకం చేసికొని సంతోషపడడమే ఆనవాయితీగ మారింది.

నేను జరుపు సువార్త కూడికలకు ఏబది మంది హాజరగుచున్నప్పుడు, ఒక వందమంది హాజరుంటే బాగుండేదని అనుకునేదానను. ఒక వందమంది హాజరయినంత మాత్రాన నా సంతోషం అధికమయ్యేది కాదు. మనం వెళ్లే ప్రతిదశలో కొంత సంతోషం కల్గినప్పటికి, దానితోపాటు ఆయా సమస్యలు

కూడా ఉత్పన్నమయ్యేవి. కనుక పరిస్థితి ఎట్లున్నప్పటికిని, ఆ పరిస్థితిలో సంతోషించడం మనం నేర్చుకోవాలి.

## పరిస్థితులు ఎట్లున్నప్పటికి, ఆ పరిస్థితిలోనే ఆనందించండి

"యెహోవా, నీ కార్యముచేత నీవు నన్ను సంతోషపరచుచున్నావు. నీ చేతిపనులబట్టి నేను ఉత్సాహించుచున్నాను."

కీర్తనలు 92:4

కొన్ని సంవత్సరాలక్రితం సంతోషానికి మార్గము నేను కనుగొన్నాను. ఆ మార్గము దేవుని సన్నిధిలోనేయున్నది.

నాకు సంతోషం కలిగించే విషయాలు దేవుడు జరిగిస్తే నేను సంతోషపడే దానను. అయితే ఆ విషయాలు జరిగించే దేవునియందు ఆనందించే దానను కాను. ఆయనయొక్క చేయి నాకు సాయంచేయాలని కోరుకొనే దానను. కాని ఆయన ముఖప్రసన్నతను అర్థించుట నాకు తెలియదు.

నీవు నీస్వంతగా కోరుకున్నది దేవుడిస్తే అది నీకు సంతోషం కల్గిస్తుందని నీవనుకోకూడదు. ఆయన నీవు కోరుకున్నది ఇవ్వగానే, మరొకలోటు నీకు కనబడుతుంది కనుక అదికావాలని కోరుతావు. ఆ విధంగా జీవితమంతా అదేవరసలో పోతుంటావు.

ఇటువంటి తెలివి నాకు కల్గిన తరువాత ఒకరోజు నేను ఒక కూడిక జరుపుటకు వెళుతూ, మంచి ప్రాచుర్యంలో ఉన్న ఒక పాట పాడుకుంటూ వెళ్లాను. "నీవు నన్ను సంతోషపరచావు, కనుక నేను ఆనందిస్తున్నాను." అప్పుడు పరిశుద్ధాత్మ నాతో" మొట్టమొదటిసారిగా "నీవు ఆ పాటను అర్థ సహితంగా పాడుచున్నావు" అని చెప్పాడు.

ఎందుకనగా దేవుడు మనం పలికే మాటలకంటే, మన హృదయాలను ఎక్కువగా అర్థం చేసికుంటాడు. ఇదివరకు నేను పాడిన పాట, "నీవు నాకొరకు చేసినవన్ని నన్ను సంతోష పరిచాయి కనుక నేను సంతోషించుచున్నాను." అన్న అర్ధంతో దేవుడు విన్నాడు.

నేను కోరినది ఆయన నాకు ఇచ్చినప్పుడు నేను సంతోషపడ్డాను. నేను కోరినది ఆయన ఇవ్వకున్నప్పుడు నాకు ఎటువంటి సంతోషంలేదు. కనుక నేను జీవించినది ఒడుదుడుకులతో కూడిన జీవితమే. అట్టి జీవితం వల్ల నేను అలసిపోయిన దాననైతిని. నా పరిస్థితులు నాకు అనుకూలమైనవైతే నేను హుషారుగాను, అవి నాకు ప్రతికూలమైతే నేను దిగులుతోను ఉండడం జరుగుతుంది.

మనం సంపూర్ణ సంతోషం గలవారంగా జీవించాలని నిశ్చయించుకుంటే, మన పరిస్థితులకు అతీతమైన దానియందు సంతోషించుటకు నేర్చుకోవాలి.

## ప్రజలయందు గాక, దేవుని యందు ఆనందించండి

"నీతిమంతులారా, యెహోవానుబట్టి సంతోషించుడి, ఉల్లసించుడి. యాదార్థ హృదయులారా, మీరందరు ఆనంద గానము చేయుడి."

కీర్తనలు 32:11

మనకు కలిగే పరిస్థితులన్ని మనకు అనుకూలమైనవైనప్పటికి, ఈ లోకంలోని ప్రజలు మన అభిరుచికి తగినవారుగా ఉండరని తప్పక తెలుసుకొంటాము. కొందరిని మనకు అనుకూలమైన వారినిగా మనం మలచుకొనేసరికి, మనకు అంకెకు రానివారు తయారుగా ఉండడం చూస్తాము. ఇది ఎడతెగని వృత్తాంతంగా మారుతుంది.

మా పరిచర్యలో సహాయకులు అనేకమంది గలరు. వారు ఎంతో మంచివారైనప్పటికిని, వారందరు నాకు సంతోషం కలిగించలేరని నేను

తెలిసికున్నాను. క్రైస్తవులమధ్యలో జీవించినప్పటికిని మనకు సంతోషం కలుగదు. మనకు అన్నివేళల సంతోషం కల్గించువాడు కేవలము యేసు ప్రభువు మాత్రమే. అయితే ఆయన మనకు సంతోషం కలుగచేయుటకు మనం ఒప్పుకోవాలి. మనం ఒప్పుకోకపోతే మనకు సంతోషం కలిగించలేడు.

## మార్త ప్రదర్శించిన విపరీత ప్రవర్తన

"అంతట వారు ప్రయాణమై పోవుచుండగా ఆయన యొక గ్రామములో ప్రవేశించెను. మార్త అను ఒక స్త్రీ ఆయనను తన యింట చేర్చుకొనెను. ఆమెకు మరియ అను సహోదరి యుండెను. ఈమె యేసు పాదములయొద్ద కూర్చుండి ఆయన బోధవినుచుండెను. మార్త విస్తారమైన పని పెట్టుకొనుటచేత తొందరపడి, ఆయన యొద్దకు వచ్చి–ప్రభువా, నేను ఒంటరిగా పనిచేయుటకు నా సహోదరి నన్ను విడిచిపెట్టినందున, నీకు చింతలేదా? నాకు సహాయము చేయుమని ఆమెతో చెప్పుమనెను."

లూకా 10:38–40

మార్త సోదరియైన మరియకు తప్ప మరెవరికిని ఆనందం, సంతోషం సమాధానం లభించు రహస్యం తెలియకపోయెను. యేసు అతిథిగా వారి యింట్లో ప్రవేశించినప్పుడు, ఆమె యేసు పాదములయొద్ద కూర్చుండి ఆయన చెప్పే మాటలలో దేనిని పోనియ్యక వినుచుండెను. ఆ రోజు యేసు వారి ఇంటికి వచ్చినందుకు ఆమె ఎంతో ఉల్లసించింది. ఆయనతో ఎంతో సంతోషంగా కూర్చుండి ఆమె కన్ను ఆర్పకుండా ఆయన వైపు చూస్తుంది.

తనకంటే పెద్దదైన ఆమె సహోదరి కూడా ఆ యింట్లో ఉండినది. ఆమె దినమంతా అటు ఇటు పరుగిడుచు, ఇల్లంతా కడిగి శుభ్రంచేసి, వంట వండి

యేసు ప్రభువు ఆయింటిని దర్శించినప్పుడు ఆయన రాకకు తగిన మర్యాద పూర్వకమైన ఏర్పాట్లు చేస్తూ వచ్చింది. (నేను కూడా మామూలుగా అంతే చేస్తాను గనుక ఈ విధంగా వ్రాస్తున్నాను).

ప్రభువు రాగానే, వెంటనే ఆహారము సిద్ధపరచి, భోజన బల్లపై ఆ వంటకాలను చక్కగా పెట్టి సరిచేయుటలో నిమగ్నురాలైంది. ఆ తరువాత ఆమె విసుగుదలతోనిండి, యేసునొద్దకు వచ్చి, "బోధకుడా, మరియ నీ యొద్ద నుండి లేచి నాకు సహాయం చేయమని చెప్పవచ్చు గదా?" అని అన్నది. ఆ విధంగా చెప్పి ఆయన యొక్క గమనమును తన కష్టమువైపు ఆకర్షించాలని ఆమె ప్రయాసపడింది. అందుకు యేసు ప్రభువు ఈ విధంగా అన్నాడు.

"మార్తా, మార్తా, నీవనేకమైన పనులను గూర్చి విచారము కలిగి తొందర పడుచున్నావు; గాని అవసరమైనది ఒక్కటే. మరియ ఉత్తమమైనదానిని ఏర్పరచుకొనెను. అది ఆమె యొద్దనుండి తీసివేయబడదని ఆమెతో చెప్పెను." (లూకా 10:41,42). ప్రభువు ఆమాటలు చెప్పిన తరువాత అక్కడ నిశ్శబ్దం ఏర్పడిందని మనం ఊహించుకోవచ్చు. మార్త ఆ సత్యం నేర్చుకొనుట తప్పనిసరి అయింది.

దేవుడు అటువంటి సంగతి నాకు కూడా ఒకసారి చెప్పాడని నాకు జ్ఞాపకానికి వస్తుంది. "జాయిస్, నీవు ఎన్నో చిక్కులతో నిండియుంటావు. కనుక సంతోషం నీకు దూరంగా ఉంటుంది," అన్నాడు. నేను ఎంతో సామాన్యమైన విషయాలను కూడా చిక్కులతో నింపుకుంటాను గనుక ప్రభువు మాటలు సరిగానేయున్నవి.

ఒకసారి మా స్నేహితులు మమ్ములను త్రోవలో కలిసికొన్నప్పుడు, ఏమి ఆలోచన లేకుండగానే, "వారితో మీరందరు, ఈ ఆదివారం మా ఇంటికి రండి. వేడి చపాతీలు, ఆలు చిప్స్, బీన్స్ కూర, మాంసం కూర, టీ, అన్ని చేసుకొని మా వరండాలో కూర్చుని భుజిద్దాం, చిన్న చిన్న ఆటలు ఆడుకుందాం, రండి!" అన్నాను.

ఆ మాటలు వారితో చెప్పి మా కారులో ఎంతో సంతోషంగా ఇంటికి చేరేసరికి, పరిస్థితి తారుమారయింది రొట్టెలన్ని ఎండి గిడస బారినవి. ఆలు చిప్స్ మెత్తగా నీరు గారి పోయాయి. మా స్నేహితులు వస్తున్నారు గనుక మా గ్యాస్ పొయ్యి పెయింట్‌తో అలంకరించాను అందంగా ఉండాలని, మా మైదానంలోని గడ్డి చక్కగా కత్తిరించబడాలని, మాయిల్లు పూర్తిగా శుభ్రంగా ఉండాలని, ఆ విధంగా వచ్చే మా స్నేహితులకు మా విషయమై మంచి అభిప్రాయం కల్గించాలనుకున్నాను.

నేను త్రోవలో కలిసికొన్న ఆరుగురు స్నేహితులను ఆహ్వానిస్తే, వారికి సంబంధించిన మరో పదునలుగురు స్నేహితులను ఆహ్వానించకపోతే వారు అభ్యంతర పడతారేమోనని అనుకొని, ఆ తలంపులతో నేను అయోమయంలోనికి జారిపోయాను.

అప్పుడు నేను కూడా మార్త వలే విపరీతమైన ప్రవర్తనతో నిండిపోయాను. ఇంటిని శుభ్రం చేస్తూ ఇంటిలోపలి భాగాన్ని కడుగుతూ, బయటి నుండి ఈ వస్తువు, ఆ వస్తువు తీసికొని రమ్మని, నా భర్తయైన డేవ్‌ని, నా కుమారులను పంపుతూ పనులతో నిండిపోయాను. “అందరూ ఆనందంగా ఉంటే నాకెందుకు ఈ తొందర” అని నా భర్త మీద విసుక్కున్నాను. అప్పుడు, నా ముఖం మీద, వాళ్లంతా, “మార్త” అన్న మాటలు వ్రాయబడ్డవి అని ఊహించుకున్నారు. ఎందుకంటే మరియ వలె ఉత్తమమైన దానిని నేను ఏర్పరచుకొనలేకపోతిని.

## ప్రస్తుతంలోనే జీవించడం నేర్చుకోవాలి

> “ప్రియులారా, యిప్పుడు మనము దేవుని పిల్లలమై యున్నాము. మనమిక ఏమవుదుమో అదిఇంక ప్రత్యక్షపరచబడలేదు గాని ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుమని యెరుగుదుము.”
>
> 1 యోహాను 3:2

ఇప్పుడు మనకున్న సమయంలో మనము సంతోషంగా ఉంటున్నామా, లేదా అన్నది, మనం చేసే తీర్మానాలపై ఆధారపడి ఉంటుంది. మనం భవిష్యత్తు విషయాలను గూర్చిన తలంపులతోనిండి, ప్రస్తుతంలోని సంతోషాన్ని పోగొట్టుకుంటాము.

"దిగులు" అనే దానికి మరో నిర్వచనమేమనగా "రాబోయే అస్పష్టమైన సంగతులను తలంచుకొని బాధపడి తొందరపడుట" అని అర్థం. దేవుడు నాకిచ్చిన నిర్వచనం కూడా ఆ కోవకు చెందినదే. "ప్రస్తుతం మన అనుభవంలో లేనివాటి విషయమై, లేక గతంలో జరిగిన వాటి విషయమై మానసికంగా ఉద్రేక పూర్వకంగా తలంచుట "దిగులు" అని పిలువబడుతుంది."

మనం ప్రస్తుతంలో జీవించే వారంగా ఉండాలని దేవుడు కోరుచున్నాడని మనం గ్రహించుకొనే అవసరం ఉంది. "అనుకూల సమయమందు నీ మొరనాలకించితిని. రక్షణ దినమందు నిన్ను ఆదుకొంటిని. అని ఆయన చెప్పుచున్నాడు గదా!" (2 కొరింథీ 6:2); "కాగా ఎవరో కొందరు విశ్రాంతిలో ప్రవేశించుదురను మాట, నిశ్చయము గనుకను, నేడు మీరాయన మాట వినిన యెడల మీ హృదయములను కఠినపరచుకొనకుడి. వెనుక చెప్పబడిన ప్రకారము ఇంత కాలమైన తరువాత దావీదు గ్రంథములో నేడని యొక దినమును నిర్ణయించుచున్నాడు." (హెబ్రీ 4:7).

ప్రస్తుతంలో జీవించడం మనం నేర్చుకోవాలి. అనేకసార్లు, మన మానసిక పరిధిలో గతంలో గాని, లేక భవిష్యత్తులో గాని జీవించడానికి అలవాటు పడ్డాము. ఈ మాటలు మీకు తమాషాగా అనిపించవచ్చు. కాని నేను ఇటువంటి మనస్తత్వంతో ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాను. నేను నా పళ్లు తోముకునేటప్పుడు సయితము దిగులుతో ఉన్నానని ప్రభువు నాతో మాటలాడాడు.

నా పళ్లు తోముకునేటప్పుడు, తరువాత ఏమి చేయాలనుకొనే మనస్సు నాకుండేది. అయ్యో అది కాలేదే అని కడుపునిండా దిగులుండేది.

నీవు, నేను ప్రస్తుతం జరుగుతున్న సంగతులలో నిమగ్నులం కాకపోతే, దిగులు మనలను ఆవరిస్తుంది. పండ్లు తోముకోవడం ఎంతో సామాన్యమైన విషయంగా మనకు కనబడవచ్చు. కాని అటువంటి సామాన్య విషయాలే, అను దినం మనకు సమస్యలు సృష్టిస్తాయి.

పరిశుద్ధాత్మలో నేను మొదటిసారిగా బాప్తీస్మము పొందిన సమయం నాకింకా జ్ఞాపకం ఉంది. జీవితంలో అతి సామాన్యమైన విషయాలను గురించి చింతిస్తూ నా మనస్సును అనేకమైన వాటితో నింపుకుంటూ ఉండేదానను. నేను ఉదయాన్నే లేచి, నా పిల్లలను తయారు చేసి స్కూలుకు పంపేదానను. నా భర్త ఆఫీసుకు వెళ్లే వరకు ఆయనకు సాయం చేసేదానను. ఇక ఆ రోజు చేయవలసిన పనులకు ఉద్యమించేదానను. కాని ఏ ఒక్క పనిమీద మనస్సు నిలకడగా ఉంచుకునే దానను కాను.

పడక బట్టలు సర్దుతూ ఉండగా, అంట్లుతోమడానికి ఏర్పాటు చేయలేదే అని వంట గదికి పరుగెత్తే దానను. పడకలు పూర్తిగా సర్దుకోలేదు కదా అని ఆలోచించను.

అంతలో ఫ్రిడ్జ్‌లోని మాంసమును తీసి నీళ్లలో వేయలేదే అని జ్ఞాపకం వచ్చేది. దానికోసం క్రింది అంతస్తుకు పరుగిడేదాన్ని. అట్లు పోతుండగా మురికి గుడ్డలను చూచి వాటిని ఉతికే మిషనులో వేయడానికి ప్రారంభించేదానను.

అంతలో ప్రాముఖ్యమైన వ్యక్తితో మాటలాడుటకు జ్ఞాపకానికి వచ్చి పై అంతస్తుకి వెళ్లి ఫోను చేయుటకు ప్రయత్నించే దానను. ఇట్లు చేస్తుండగా తపాలా ఆఫీసుకు వెళ్లి కొన్ని ఉత్తరాలు వచ్చాయా లేదా కనుక్కుందామని, అన్ని పనులు అర్ధాంతరంగా ఇంట్లో వదలి తపాలా ఆఫీసుకు పోవడానికి బయలుదేరేదానను.

ఆ విధంగా, ఆ దినం అయిపోయేసరికి అన్ని పనులు అస్తవ్యస్తంగా తయారయ్యేవి. పనులన్ని సగంలో ఆగిపోయేవి. నేను ఏపని పూర్తి చేయలేక

అలసిపోయాను. నేను ఏ పనిని పూర్తిగా చేయుటకు పూనుకోలేదు గనుక ఆవిధంగా సంగతులు పరిణమించినవి.

## ఏ పనినైనా పూర్తి చేసేవరకు మరో దానిని ముట్టుకోవద్దు

"నీవు దేవుని మందిరమునకు పోవునప్పుడు నీ ప్రవర్తన జాగ్రత్తగా చూచుకొనుము, బుద్ధిహీనులు అర్పించునట్లుగా బలి అర్పించుటకంటె సమీపించి ఆలకించుట శ్రేష్ఠము, వారు తెలియకయే దుర్మార్గపు పనులు చేయుదురు."

ప్రసంగి 5:1

మనం ఒక పనిని పూర్తిగా ఎందుకు ముగించమో తెలుసా? ఎందుకంటే ఆ పని తరువాత చేయవలసిన పని విషయం ఎక్కువ ఆలోచన కలిగియుంటాము. కనుక ప్రసంగి చెప్పినట్లు చేయడం మనకు ఎంతోమేలు. మనం ప్రస్తుతం ఏం చేస్తున్నాము అన్న దానిని జాగ్రత్తగా చేయుటకు నేర్చుకోవాలి. అట్లు చేయకపోతే మన సమతుల్యత దెబ్బతిని ఏపని సరిగా చేయలేని వారంగా తయారౌతాము.

మనం ప్రస్తుతంలో జీవించాలిగాని, భవిష్యత్తు కాలంలోనో, భూతకాలంలోనో జీవించకూడదు. మనం నిన్నటి సంగతులను నెమరు వేసికొంటూ, రేపటిని గూర్చిన ఊహలలో జీవిస్తుంటే నేడు చక్కగా జీవించుటకు కావలసిన అభిషేకాన్ని పోగొట్టుకుంటాము. ఏ రోజు జీవితం ఆ రోజు జీవించుట వలన, మనం చేరవలసిన గమ్యం ఘనంగా చేరగలము.

అన్ని అప్పుడప్పుడు జరిగిపోవాలనుకునే సమాజములో జీవిస్తున్నాము. ఎవరో వచ్చి మంత్రదండం ఆడించి అన్ని మెరుగు పరిస్తే బాగుండునను కుంటాము. అయితే సంగతులు ఆ విధంగా జరగవు. మార్పు అన్నది రోజువారీగా వస్తుంది.

## ఏ రోజు జీవితం ఆ రోజు జీవించు

"రేపటినిగూర్చి చింతింపకుడి; రేపటి దినము దాని సంగతులనుగూర్చి చింతించును; ఏనాటికీడు ఆనాటికి చాలును."

మత్తయి 6:34

యోహాను 8:58లో యేసు ప్రభువు "నేను ఉన్నవాడను" అని తనను గురించి తాను చెప్పుకొనుచున్నాడు. ఆయన శిష్యులమైన మనం గతంలో గాని, రాబోవు కాలంలో గాని జీవించువారమైతే, మన జీవితాలు దుర్భరంగా మారతాయి. ఎందుకంటే యేసు ప్రభువు ఎల్లవేళల ప్రస్తుతంలో జీవించేవాడుగా ఉన్నాడు. కనుక ఆయన నిన్నటిని గూర్చి గాని, రేపటిని గూర్చి గాని చింత పడవద్దని మనకు బోధించాడు.

మనం గతంలో గాని భవిష్యత్తులో గాని జీవిస్తే జీవితంలో కష్టాలు ఎదుర్కొంటాము. మనం ప్రస్తుతంలో జీవించడం నేర్చుకుంటే ప్రభువు మనతో ఉన్నాడని గ్రహించగలము. రోజులో ఏ పరిస్థితి సంభవించినా ప్రభువు మనలను విడువడని ఎడబాయడని మనతో చెప్పాడు. ఆయన మనతో ఉండి మనకు సాయంచేస్తానని ఆయన వాగ్దానం చేశాడు. (హెబ్రీ 13:5, మత్తయి 28:20).

ఒక పని ప్రస్తుతంలో పూర్తిగా చేయుటకు మనలను మనం అప్పగించుకొనుట అనేది, కేవలం భౌతిక విషయం మాత్రమే కాదు గాని, అది మానసికమైన, భావోద్రేకములకు సంబంధించిన విషయమైయున్నది. ఉదాహరణకు, శారీరకంగా మనం ఒక స్థలములో నిలువబడినను, మానసికంగా మరో వ్యక్తితో సంభాషణ కలిగియుండే అవకాశం కూడా ఉంది. మానసికంగా ఆ విధంగా మనం చేస్తున్న పనిగాక మరో పనికి ఉపక్రమిస్తే మనపైన అనవసరమైన ఒత్తిడి పెరుగుతుంది. మనం మానసికమైన తలంపుల నుండి బయటపడి మళ్లీ ప్రస్తుతంలోనికి వస్తే, మనం కొంతసేపు మన ఆలోచన ప్రస్తుతంలో పెట్టలేదు కనుక ఆ సమయంలో ఏమి జరిగిందో తెలియక తికమక పడతాము.

కనుకనే సాతాను మనలను ప్రస్తుతం నుండి దొంగిలించడానికి, మనం ప్రస్తుతంలో జీవించకుండా చేయడానికి ప్రయాసపడుతుంటాడు.

నా భర్తచేసిన ఒక విషయంలో నేను కోపగించుకున్న ఒక సంగతి నాకు జ్ఞాపకానికి వస్తుంది. ఆ దినాలలో నాకు కోపంవస్తే కొన్నిదినాలవరకు ఆ కోపంలోనే నేను ఉండేదానను. ఒక రోజు “నీవు కోపంగా ఉన్న దినంలో యేసు ఈ భూమి మీదికి వస్తే, ఆ కోపంలో ప్రభువు నిన్ను చూస్తే అది నీకు ఎంత దయనీయంగా ఉంటుంది?” అన్నాడు డేవ్. ఆ మాటలు నా గమనాన్ని ఆకర్షించినవి. నేను ఆలోచనా పరురాలనయ్యాను.

ఈ రోజు మనం చేయవలసినది చేయగల్గియున్నప్పుడు. రేపటినిగూర్చి దిగులుచెందనక్కరలేదు. ఈ రోజు మనసమస్యలు మనం పరిష్కరించు కొన్నప్పటికి, మళ్లీ రేపుకూడా సమస్యలు ఉత్పన్నమౌతాయి. ఆ తరువాతి రోజు ఇంకా ఎక్కువ సమస్యలు వస్తాయి.

మనం పరిష్కరించలేని దానిగురించి ఆలోచించుట వల్ల మనం సమయం వ్యర్ధ పరచినట్లే. జరిగిపోయిన నిన్నటిని గురించి, ఇంకా మనముందుకు రాని రేపటిని గురించి ఎందుకు తాపత్రయపడాలి. కనుక నీవు ప్రస్తుతంలోనే జీవించు. నీవు భయపడవద్దు. నీవు దిగులుపడవద్దు.

# 4

# దేవుని తలంపులు మన తలంపులకంటే గొప్పవి

అన్ని సంగతులు నీవనుకున్న సక్రమమైన మార్గంలో చేయుటకు ప్రయత్నిస్తున్నావా? అనేకులు అదే ఊబిలో పడిపోయారు. మన చింతయావత్తు ప్రభువుపై మోపుటకు బదులు మనమే జీవితంలోని బరువు భారాలు మనంతట మనమే మోయాలనుకుంటాము.

నీ తెలివిచొప్పున అన్ని సంగతులు చేయగోరుచున్నావంటే, అర్థమేమంటే, మన జీవితం విషయమై దేవునికున్న తలంపులు ఏర్పాట్లకంటే మనం తెలివిగల వారమని చెప్పుకొనుచున్నట్లే. మనమార్గాలను దేవుని మార్గాలకంటే గొప్పవిగా ఎంచుకొనుచున్నామని అర్థము.

కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక 10:5లో, "ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి" అని వ్రాయబడింది. మనము మన తలంపులను ఆయన చెరలోనికి తెచ్చుకొన్నప్పుడు, ప్రతిపనిని మనయిష్టానుసారంగా చేయక, దేవుని మీద ఆధారపడుదుము. అందువలన ఆయన విశ్రాంతిలో ప్రవేశింతుము.

# దేవుడిచ్చు విశ్రాంతిలోనికి ప్రవేశించుము

"విశ్వాసులమైన మనము ఆ విశ్రాంతిలో ప్రవేశించుచున్నాము." (అనగా ఆయనకు చేర్చబడిన ఆయనను నమ్ముకొనిన, ఆయన పై ఆధారపడిన మనము ఆయన విశ్రాంతిలో ప్రవేశించు చున్నాము).

హెబ్రీయులకు 4:3

ఈ భాగములో ఇశ్రాయేలీయులు అరణ్యములో తిరుగులాడుటకు బదులు, కానాను దేశములో ప్రవేశించుటను గూర్చి వ్రాయబడింది. ఈ సంఘటనను మనం మన జీవితాలకు అన్వయించుకోవచ్చు: మనం నిజంగా విశ్వాస ముంచక ఆయన మీద ఆధారపడకుండా ఉంటే ఆయన విశ్రాంతిలోనికి ప్రవేశించలేము.

కొన్నిసార్లు నేను అన్ని నా ఏర్పాటు ప్రకారం జరగాలని అనుకుంటాను. మరియు జరుగుచున్నవి ఏ విధంగా జరుగుతున్నవోనన్న విధానం అర్థం చేసి కోవాలనుకుంటాను. ఆ విధంగా నేను చేస్తున్నప్పుడు నిజంగా దేవునిపై ఆధారపడనట్లే గదా?

సామెతలు 3:5లో "నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణ హృదయముతో యెహోవాయందు నమ్మకముంచుము."

నేను నా నోటితో దేవుని పై ఆధారపడుతున్నానని చెబుతున్నాను గాని నా హృదయమందు ఏయేసంగతులు ఎట్లు చేయాలన్న నమూనాను కల్గి ప్రవర్తించుచున్నాను. సామెతలు 3:5 చెప్పునదేమనగా మనము దేవునిపై మన మనస్సులో, హృదయంలో ఆధారపడాలి.

ప్రతి పని యొక్క హేతువేమి అని పట్టుబట్టకూడదు.

## సత్యమునకు విరుద్ధమైన ఆలోచన సరళి

"మీరు వినువారు మాత్రమైయుండి, మిమ్మును మీరు మోసపుచ్చు కొనకుండ వాక్యప్రకారము ప్రవర్తించువారునై యుండుడి." (విన్న వర్తమానమునకు విధేయత చూపండి). (సత్యమునకు విరుద్దమైన ఆలోచన కల్గియుండవద్దు).

యాకోబు 1:22

అమితంగా ఆలోచించడం మానుకోమని ప్రభువు నాతో అనినప్పుడు, ఆ మాటలకు విధేయత చూపుట నాకొక సవాలుగా మారాయి. ఎందుకంటే ప్రతిపని గురించి ఎక్కువగా కారణాలు అన్వేషించడం నాకొక చెడలవాటుగా మారింది. ఒక విషయాన్ని గూర్చిన పూర్వపరాలు నాగుప్పిట్లో ఉండకపోతే నాకు మనస్సు నెమ్మదిగా ఉండేది కాదు.

ఉదాహరణకు మా సేవా పరిచర్యలలో ఒక విషయాన్ని గురించి ఫలాని రీతిగా చేయాలని దేవుడు నాతో చెప్పాడు. ఆ విషయాన్ని ఎట్లు చేయాలన్న సంగతి నాకసలు తెలియనే తెలియదు. ఆయన నాకు ఆజ్ఞాపించిన విషయాలలో ఒకటి, అనుదిన టెలివిజన్ సువార్త పరిచర్య. ఆ పని చేపట్టుటవల్ల దానికయ్యే ఖర్చు, దానికి సంబంధించిన సిద్ధపాటు పనులు మామూలుకంటే ఐదు రెట్లు అధికమయ్యాయి. పనిచేసే సిబ్బంది సంఖ్య పెంచవలసి వచ్చింది, మరియు ఆపనికి సంబంధించిన వాటిని నిర్వహించుటకు సదుపాయమైన స్థలము కూడా ఎక్కువ కావలసి వచ్చింది.

ఆ కార్యక్రమం గురించి ఫలాని వివరాలగురించి నేనాలోచించాలని ఆయన చెప్పలేదు. ఆ పని ఆయన నన్ను చేయమన్నాడు. ఆ సమస్యకు తగిన పరిష్కారములను గూర్చి కాదుగాని, ఆయన సన్నిధిని మాత్రమే నేను వెదకాలని ఆయన కోరాడు. ఆ తరువాత ఆయన చెప్పినది నేను చేయాలని ఆయన కోరాడు.

ఆ పనికి కావలసిన డబ్బు ఎక్కడ నుండి తేవాలి, ఎవరెవరిని పనిలో పెట్టుకోవాలి, ఎంత స్థలము అందుబాటులోకి తెచ్చుకోవాలన్న ఈ విషయాలన్ని నాకు తెలియవు. అయితే ఆ పని నాకు అప్పగించిన దేవుని గురించి నాకు అనుభవం ఉంది. ఆయన నీడలో, ఆయన రెక్కల చాటున నేను ఉండాలి. ఆయన అప్పగించిన ఉత్తరవాదత్వం నేను నెరవేర్చాలి, నా చింత యావత్తు ఆయన మీద వేయాలి. అప్పుడు ఆయన తన ఏర్పాటుననుసరించి, ఆయన ప్రణాళిక చొప్పున సంగతులు జరిగిస్తాడు.

నా బాధ్యత ఏమిటంటే, దేవుడు నాకు చూపించేదాని విషయంలో, దేవుడు నానుండి కోరునదేమనగా, "దేవా అదినేను చేయుటకు తగిన ఏర్పాట్లు చేస్తున్నానని" చెప్పాలి. ఆయన చూపించేవి ఆయన చేస్తాడని, దానికి కావలసిన తగులుబడి ఆయన ఇస్తాడని నేను నమ్మాలి. అయితే ఆయన చెప్పిన దాని కొరకు నేను చింతపడి, ఎట్లు చేయాలన్న దిగులు కల్గి ఉండాలని ఆయన కోరడు. ఆ పనులు చేయడానికి ఆయన నన్ను నడుపుచున్నాడు.

మనం చింతించుట వలన మన సమాధానం పోగొట్టుకుంటాము. ఎట్లు చేయాలన్న ఆలోచన కలిగియుంటే కలవరంలో మునిగిపోతాము. సమాధానము కల్గియుండాలంటే ఆయన రెక్కల నీడ క్రింద చేరియుండుటే మార్గము.

"ప్రభువా ఎందుకు మాకు కలవరం కలుగుతుంది?" అని ప్రభువును ఒకసారి అడిగాను. అందుకు ఆయన, "నీవు ఎప్పుడు అమితమైన ఆలోచన కల్గియుండుట మానివేస్తావో, అప్పుడు నీవు కలవరము చెందవు" అని ప్రభువు చెప్పాడు.

మనకు కలవరము ప్రారంభమౌతుంటే దాని అర్థమేమనగా, మనం త్రోవ తప్పి అపాయములో చిక్కుకుంటామేమో అని అర్థము.

దేవుని నమ్మకుండా, ఆయన ప్రణాళిక ప్రకారము నడువకుండా ఉంటే, మన జ్ఞానము చొప్పున మన సమస్యలు తీర్చుకోవాలనుకుంటే, మనలో కలవరము తప్పక వస్తుంది. మన తలంపులకంటే, ఆయన తలంపులు ఎంతో

గొప్పవి అనుకున్నప్పుడు కలవరం చోటు చేసుకోక మునుపే దానిని మనం అర్థం చేసుకోగలము.

## సంభాషణలు

“వారు సమాజమందిరముల పెద్దలయొద్దకును అధిపతులయొద్దకును అధికారులయొద్దకును మిమ్మును తీసికొని పోవునప్పుడు, మీరు ఏలాగు ఏమి ఉత్తరమిచ్చెదమా, యేమి మాటలాడుదుమా అని చింతింపకుడి. మీరేమి చెప్పవలసి నదియు పరిశుద్ధాత్మ ఆ గడియలోనే మీకు నేర్పుననెను.”

లూకా 12:11,12

కొన్నిసార్లు మనమేమి చేయాలో, ఏమి చెప్పాలో అని ముందుగానే పథకం వేసి పెట్టుకుంటాము. కొన్నిసార్లు భార్యాభర్తలు వారి గృహానికి సంబంధించిన ఏదో ఒక విషయాన్ని పరిష్కరించుకోడానికి, ఒకరితో ఒకరు వాదోపవాదాల్లో నిమగ్నులైయుండవచ్చు. నీవు పనిచేసే స్థలంలో జీతం పెంచమని నీ అధికారిని అడగవలసిన అవసరం ఉండవచ్చు, లేక నిన్ను వేదించే సహఉద్యోగిని శిక్షించమని అడగాలనుకోవచ్చు. కనుక ఇప్పుడున్న పరిస్థితులు ఏమైనప్పటికి, వాటన్నిటిని బట్టి నీవు దిగులు పడుతుండవచ్చు.

నీవు ఏ పరిస్థితిలోనున్నప్పటికి, దానిని గురించి నీ మనస్సులో మదనపడేకంటే, దేవునియందు విశ్వాసముంచితే, మంచిది. ఈ పరిస్థితిలో నేనేమి చెప్పాలనుకునే కంటే, దేవుడే ఆ పరిస్థితి నీముందుంచాడని నమ్మితే ఎంతో బాగుంటుంది కదా!

ఆ ఫలాని సంగతిని గూర్చి నీవు పదే పదే ఆలోచిస్తూంటే, ఆ సంగతి సూచించేదేమంటే, నీవు దేవునిపై ఆధారపడేకంటే నీపై ఆధారపడుతున్నవని, అందువల్ల ఆ విషయంలో నీవు జయము పొందలేవని తెలిసిపోతుంది.

నీవు గాని, నేను గాని దేవుని నడిపింపు ప్రకారము ఆయన అభిషేకము క్రింద కొన్ని మాటలు పలికితే సమాధానము సామరస్యత తీసుకొని రాగలమని నీవెరుగుదువా? శరీరమును ఆధారము చేసుకొని రెండువందల మాటలు పలికినప్పటికిని మనము గొప్ప అపాయమును, కలవరమును పుట్టించు వారమగుదుము. కొన్నిసార్లు ఒక జఠిలమైన సమస్యను పరిష్కరించుటకు మన బుర్ర పాడుచేసికొంటాము. ఫలాని రీతిగా చేద్దాము అని మనస్సులో నిర్ణయించుకొన్న తరువాత, మనలను కలవరపరచే తలంపు కలిగి, మనం చేసేది సరిగా లేదేమోనని అనుకుంటే మనము గొప్ప కలవరములో చిక్కుకుపోతాము.

ఒకనాటి రాత్రి నేను నా పడకమీద పరుండి నా విశ్రాంతిని కలవరపరచే ఒక పరిస్థితిని గూర్చి ఆలోచనలో మునిగాను. ఇక అంతులేని మనోవేదనను బట్టి నాలో నేనే సంభాషించుకొన మొదలుపెట్టాను. “నేను ఈలాగున చెబితే, వారు ఇంకో విధంగా చెబుతారు. ఆ మాటలు నాకు విసుగుపుట్టిస్తాయి. అప్పుడు నేనేమి చేయాలి” అనుకున్నాను.

నేను ఎవరిని అభ్యంతర పరచకూడదనుకున్నానో వారితోనే వారికిష్టము కాని సంభాషణలో నిమగ్నం కావలసి వస్తుందని నాకు తెలుసు. అది సుళువైన విషయం కాదని కూడా నాకు తెలుసు. వారికి కోపంపుట్టించడం నాకిష్టం లేదు. కాని నా బాధ్యతను విస్మరించి మనుష్యులను సంతోషపెట్టు దానను గా నుండుట నాకిష్టము లేదు. (ఎఫెసీ 6:6, కొలస్సి 3:22). కనుక ఈ విషయంలో నాకు సమాధానము, ధైర్యము అవసరమైయుండెను.

దైవ సమాధానము ఎల్లప్పుడు మన అందుబాటులోనున్నది. అయితే దానిని కోరుకునే బాధ్యత మనదే? దిగులు అనే సూర్యుని వేడిమిలో ఉండవలెనా? అనగా, చెమటకారుతూ దాహంతో ఎండిపోయిన వారంగా ఉండవలెనా, లేక దేవుని సమాధానం కల్గి ఆయన చల్లని నీడలో ఉండవలెనా అన్నది మనపైననే ఆధారపడి ఉంది.

## మన విషయమైన దేవుని ఏర్పాట్లు ఎంతో మంచివి

"నేను మిమ్మునుగూర్చి ఉద్దేశించిన సంగతులను నేనెరుగుదును. రాబోవు కాలమందు మీకు నిరీక్షణకలుగునట్లుగా అవి సమాధానకరమైన ఉద్దేశములే గాని హానికరమైనవి కావు; ఇదే యెహోవా వాక్కు."

యిర్మీయా 29:11

నా బాల్యకాలపు బాధాకరమైన పరిస్థితులను బట్టి, నేను చెప్పవలసిన ఏ విషయమైన నాకు క్షుణ్ణంగా సరియైనదని తెలిస్తేనే నోరు విప్పి మాటలాడే దానను. ఒకవేళ ఏదైనా తప్పు మాటలాడితే దానికి తగిన శిక్ష నేను అనుభవించాలని నాకు తెలియును.

నేను చేయబోవు సంభాషణలలో పలికే పలుకులన్ని బహు తేటయైన సరియైనవిగా ఉండుటకు, నా మనస్సులోనే ముందుగా వాటిని గురించి ఒక క్రమంలో పెట్టుకునేదానను. ఇట్లు ఎన్నో సంవత్సరాలు తరబడి చేయవలసి వచ్చింది. కనుక విరుద్ధమైన తలంపులు, నన్ను నేను కాపాడుకునే తలంపులను ఎట్లు తలంచవలెనో అను ప్రక్రియకు అలవాటు పడిపోయాను.

నాలో కల్గిన అభద్రతా అనుభూతిని బట్టి నేను నిరాకరింపబడతానేమో అన్న తలంపుతో ఎవరైనా సాధారణ ఉద్దేశ్యాలతో పలికిన ఏ మాటకైనా దీర్ఘంగా ఆలోచించి దాని అర్థం ఫలానా అని నాలో ఒక నిర్ణయానికి వచ్చే దానను.

మన మనస్సులు ఆ విధంగా ఆలోచించాలని దేవుడు ఏ మాత్రము ఇష్టపడడు. మన పరలోక తండ్రికి మన జీవితం విషయం ఒక ప్రణాళిక కల్గియున్నాడు. ఆయన మార్గములు, మన మార్గములకంటే ఎంతో గొప్పవి. (యెషయా 55:8,9). నీవు గాని, నేను గాని, దేవుడు ఈ విధంగా ఉంటాడని మనం చెప్పలేము.

కొన్ని సంవత్సరాలు ప్రభువుతో పోరాడిన తరువాత, “నా సమస్య ఏమిటి ప్రభువా?” అని ఆయనను అడిగాను. అప్పుడు ప్రభువు నాతో అన్న మాటలు నా జీవితాన్ని మార్చివేశాయి. “జాయిస్, నీవు పెంచబడిన విధానమును బట్టి భయము నీ ఆలోచన సరళిలో జీర్ణించుకుపోయింది.” అన్నాడు.

నేను పరిశుద్ధాత్మతో నింపబడినది మొదలుకొని నాలోని భయాన్ని వేర్లతోసహా పెకలించివేయుటకు ప్రభువు ప్రయత్నం చేస్తూనేయున్నాడు. అయితే ఎంతో కాలంగా ఈ ప్రక్రియ నాలో ప్రారంభమైనప్పటికి, ఆ కార్యం పరిపూర్ణమగుటకు ఇంకా ఎంతోకాలం పడుతుందని నేను తలస్తున్నాను. అట్లయినప్పటికిని ప్రభువు నాతో “జాయిస్, అంతా సవ్యంగానే జరుగుతుంది” అని చెప్పాడు. అప్పుడు నాలో ఆ కార్యము పూర్తయినట్లయింది. నా పిల్లలు ఏడుస్తూ నా దగ్గరకు వచ్చినప్పుడు నేను వారితో “ఫరవాలేదులే, అంతా సవ్యంగానే ఉంది, అన్ని సరిచేస్తానులే” అంటాను. ప్రభువు కూడా నాతో అలాగే అంటున్నట్లు అనిపించింది. ఆ మాట సామాన్య మైనదైనప్పటికి, నాకు కలిగిన అనేక పరిస్థితుల్లో నేను ఆ మాటను జ్ఞాపకం చేసికొనేదానను.

ఒకసారి నేను, నా పరిచర్యలోని సిబ్బంది అందరము కలిసి ఒక సెమినార్‌ను నిర్వహిద్దామని నిర్ణయించుకున్నాము. టేపురికార్డులపై అంటించే ముద్రణా కాగితాల కొరకు తగిన ఏర్పాటు చేశాము. అయితే ఆఖరి నిమిషములో మేము వారికిచ్చిన ఆర్డరు కాగితము వారు పోగొట్టుకున్నామని చెప్పారు. అందువల్ల మళ్లీ అర్జెంటుగా ఆ ముద్రణా కాగితాలను పంపమని ప్రత్యేకంగా ఆర్డరు వేయవలసి వచ్చింది. అయినను అవి మా యొద్దకు సరఫరా కావలసిన దినము అయిపోయినప్పటికి అవి రాలేదు. అయితే ఆ పరిస్థితి గమనించి నేను, “ఫరవాలేదు, అన్ని సవ్యంగానే జరుగుతాయిలే” అన్నాను. ఆ మాట అని నేను ఇంటికి వెళ్లగానే ఆ ముద్రణా కాగితాలు వచ్చినట్లు మా సిబ్బంది ఫోనులో నాకు తెలిపారు.

## నమ్మకమును వృద్ధి పరచుకోవాలి

"అంతే కాదు; శ్రమ ఓర్పును, ఓర్పు పరీక్షను, పరీక్ష నిరీక్షణను కలుగజేయునని యెరిగి శ్రమలయందును అతిశయపడుదము."

రోమా 5:3,4

అటువంటి పరిస్థితులలో ఎన్నిసార్లు మనం కృంగిపోయి, అనవసరంగా నిరాశపాలయ్యాము. "నేను నమ్ము దేవునియందు నేను విశ్వాస ముంచుచున్నాను." అని చెప్పుచున్నపటికిని, మనము చింతించుచూ, అందు విషయమై విరుద్ధ భావనతో మాటలాడతాము. అట్లు ఎన్నో సంవత్సరాలు గడిపాము. పైకి, "నేను దేవుని నమ్ముతున్నానని చెబుతావు గాని," లోపల ఎంతో పిరికితనంతో అపనమ్మకంతో ఉంటావు. దాని అర్థం ఏమంటే, నీవు దేవుని నమ్మడానికి ప్రయత్నిస్తున్నావు గాని, ఇంకా నమ్మిన స్థలంలోకి చేరలేదు.

దేవుని నమ్మడం అంటే, "ఏం ఫరవాలేదు, అంతా సవ్యంగా జరుగుతుందని చెప్పడమే" అని నేను చెబుతున్నానని నీవు అనుకుంటున్నావా? నా భావన అదికాదు గాని, నమ్మకమును దానివలన కలిగే ధైర్యమును వృద్ధి చేసుకొనుటకు గాను కొంతసమయం పడుతుంది. మనలోపల పాతుకుపోయిన చింతను, దిగులును, భయాన్ని తీసివేసికొనుటకు సయితము కొంత సమయం పడుతుంది.

కనుకనే దేవుని యందు విశ్వాసముంచు విషయంలో నిరాశపడవద్దు. నీకు ఆయాపరిస్థితులు ఎదురై ఆయనయందు నమ్మకముంచు తరుణములు సంభవించిన కొద్దీ విశ్వాసములో బలము సంపాదించుకుంటావు. కొంతకాలం గడిచే సరికి, సాతాను నిన్ను వశపరచుకోలేనంత బలవంతుడవవుతావు.

## విశ్వాసం వృద్ధిపొందించుకొనే విషయంలో దేవుడు మాత్రమే మనకు నిజమైన సహాయకుడుగా ఉంటాడు

"గర్భమునుండి నన్ను తీసినవాడవు నీవే గదా నేను నా తల్లియొద్ద స్తన్యపానము చేయుచుండగా నీవే గదా నాకు నమ్మిక పుట్టించితివి.

గర్భవాసినైనది మొదలుకొని నాకు ఆధారము నీవే. నా తల్లి నన్ను కన్నది మొదలుకొని నా దేవుడవు నీవే. శ్రమ వచ్చి యున్నది, సహాయము చేయువాడెవడును లేడు. నాకు దూరముగా నుండకుము."

కీర్తనలు 22:9-11

చాలాకాలం నుండి నేను దేవునితో నడుస్తూ ఉన్నాను. గనుక కొన్ని కష్ట సమయాలు కూడా నాకు ఎదురయ్యాయి. ఎన్నో సంవత్సరాలు సాతాను నన్ను తన అదుపులో ఉంచుకొనుచు, అనేక విషయాల్లో నన్ను మభ్యపెట్టిన సమయాలను నేను ఎన్నడూ మరువలేను. ఎన్నో రాత్రులు "అబ్బో ఈ పరిస్థితి నేను తట్టుకోలేను" అని చెప్పి ఏడుస్తు ఇంట్లో అటూ ఇటూ తిరిగాను. ఎన్నోసార్లు నా స్నేహితులు నాకు సాయపడతారని వారి యొద్దకు పరుగులు తీశాను. ఆ తరువాత కొంచెం జ్ఞానం కల్గి ఇకనుంచి వారి యొద్దకు వెళ్లుటమానుకున్నాను. ఎందుకంటే వారు నాకు సహాయం అందించడానికి వారికి శక్తిలేదు అని గ్రహించాను.

ఒక బోధకుడు ఇట్లు అన్నాడు. "మనుష్యులు నీకు సహాయం చేయగల్గితే ఇక నీకు సమస్యలుండవు కదా!" అన్నాడు.

నా భర్తకు సమస్యలు కలిగినప్పుడు, కష్టకరమైన పరిస్థితులలో గుండా వెళ్లు చున్నప్పుడు తన సమస్యలు తానే పరిష్కరించుకొనడానికి ప్రయత్నిస్తే నేను "నాతో ఎందుకు చెప్పలేదని" పిచ్చి కోపంతో అరచే దానను. ఆ తరువాత రెండు మూడు వారాలకు తనకు ఆ సమస్య నుండి విముక్తి కలిగిన తరువాత

నాతో ఆ విషయం పంచుకునేవాడు. “కొన్నివారాల క్రిందట నాకు ఫలాని సమస్య కలిగింది”, అని నా భర్త చెబుతున్నప్పుడు, వెంటనే “నీ వెందుకు నాతో చెప్పలేదు?” అన్నాను.

అప్పుడు ఆయన ఇచ్చిన సమాధానమేమంటే “నీవు ఆ సమస్యను పరిష్కరించలేవని నాకు తెలుసు. కనుక నీతో చెప్పలేదు.” అని ఆయన అన్నాడు.

నీకు ప్రియమైన వారితో నీ సమస్య పంచుకోవద్దని నేను చెప్పుటలేదు. అయితే డేవ్ అర్థం చేసికొన్న సత్యాన్ని, నా జీవితంలో అనుసరించడానికి ప్రయత్నించాను. నా సమస్యలను దేవుడు మాత్రమే పరిష్కరించగల సమయాలు కూడా నా జీవితములో కలిగియున్నాను. నా భర్తకు నేను సాయం చేయాలనుకున్నాను గాని నా వలన కాలేదు. తన సమస్యలు దేవుడు మాత్రమే తీర్చగలిగాడు కనుక నా భర్త ఆయన యొద్దకు మాత్రమే వెళ్లుటకు నేర్చుకున్నాడు.

ఎవరికి తెలియకుండా శ్రమపడుట నేర్చుకోవాలని ప్రభువు ఒకసారి నాతో అన్నాడు. దానిని అర్థం చేసికొనేందుకు దేవుడు నాకు యెషయా 53:7 చూపించాడు. “అతడు దౌర్జన్యము నొందెను, బాధింపబడినను అతడు నోరు తెరవలేదు. వధకు తేబడు గొఱ్ఱె పిల్లయు బొచ్చు కత్తిరించువానియెదుట మౌనముగా నుండునట్లు అతడు నోరు తెరువలేదు.” నీవు దేవునితో నడచునప్పుడు ఒక స్థాయికి వచ్చిన తరువాత, దేవునిలో ఎక్కువ బలము పొందుటకు ఇది ఒక బంగారు సూత్రమని చెప్పవచ్చును.

## నీ భారము యెహోవా మీద మోపుము

“ఆయన మిమ్మునుగూర్చి చింతించుచున్నాడు గనుక, మీ చింత యావత్తు ఆయన మీద వేయుడి.”

1 పేతురు 5:7

దేవునితో నేను నడచుకొనుచున్నాను గనుక నా జీవితంలో నిలకడ కలిగి, చింతించకుండా, అనవసరమైన భయములను వదలిపెట్టి, నా చింతయావత్తు ఆయనపై వేసే స్థితికి ఎదగాలని కోరాను. నా భర్త విషయానికి వస్తే, ఆయన ఈ విషయంలో ఎంతో గొప్ప వరం కలిగినట్లు ప్రవర్తించేవాడు. నా భర్త దేవునితో నడుచుకొనేవాడు గనుక, దేవుడు ఆయనకు సమాధానంతో నింపాదుగా నుండే స్థితి దయచేశాడు. (నేను చింతించుటలో ఎంతో ఎదిగాను కనుక, నా భర్త కూడా ఆలాగుంటే ఎంత బాధపడేవారమో కదా!)

నేను ఇంటి దగ్గర ఖర్చులన్నిటిని పద్దు వ్రాసేదానను. లెక్కలు చేయుటలో ఉపయోగపడే కాలిక్యులేటర్‌పై ప్రతినెలా ఖర్చులతో నిండిన బిల్లులను ఒక దానితో నొకటి జమచేసేదానను. ఆ పద్దులను చూచి ఇంత పెద్దమొత్తాన్ని ఎట్లు చెల్లించాలి? అని అనుకొనుచు కలవరపడుతుండేదానను. మా ఇంట్లో అవతల గదిలో డేవ్ పిల్లలతో ఆడుకుంటు ఉండేవాడు. పిల్లలు ఆయన వీపు మీద ఎక్కుచూ, టెలివిజన్‌లోని కార్యక్రమాలను చూస్తూ ఎంతో అల్లరి అల్లరిగా ఉండేవారు.

ఇదంతా చూచి, నేనైతే ఇంతగా దిగులు పడుతుంటే వీళ్లు ఇంత సంతోషంగా ఉన్నారే అని డేవ్‌పై కోపగించుకొనేదానను.

నిజమే కదా! మనం బాధలో ఉన్నప్పుడు ఇతరులు సంతోషంగా ఉంటే మన బాధ ఎక్కువవుతుంది.

నేను వంట గదిలోకి వెళ్లి నా చేతులు నలుపుకుంటూ, "దేవా ఈ నెలలో ఎంతో డబ్బు చెల్లించవలసి ఉంది. మీరే మా పక్షంగా సాయం చేయండి. అని సరిగానే ప్రార్థించే దానను గాని, నా మనస్సులో ఎంతో బాధ కల్గియుండేదానను. నెలాఖరు వచ్చే సరికి, దేవుడే మా ఆర్థిక విషయాల్లో అద్భుతాలు చేసేవాడు. అయితే వచ్చే నెలలో కూడా ఇంతే గదా అని మరలా చింతించవలసి వచ్చేది.

మేము దేవుని చేతుల్లో ఉన్నాము అని నిశ్చయత కల్గియున్నప్పటికి, చింత మమ్మును వెంటాడుతూనే ఉండేది."

దేవుని నమ్మి ఆయనపై ఆధారపడుట అనునది మన స్వంత అనుభవంలో అనుభవించాలి. ఏదో ఒకసారి ప్రార్థించినందువల్ల గాని, లేక ఎవరో మన తలపై చేతులు ఉంచినందువల్ల గాని, ఆ అనుభవం రాదు. ఇతరులు ఎవరూ దానిని మనకివ్వలేరు. దినాలు గడిచేకొలది, కాలక్రమేణా దేవునిపై ఆధారపడడం మన స్వంత అనుభవంలో నేర్చుకొనవలసి యున్నాము.

## దేవునికి మొఱపెట్టుము

"ప్రభువా, దినమెల్ల నీకు మొఱ్ఱపెట్టుచున్నాను నన్ను కరుణింపుము."
కీర్తనలు 86:3

నేను ఆర్థికపరమైన విషయాలలో దేవుని నమ్మడం మాత్రమే గాక, నేను పనిచేయు కార్యాలయపు గదిలో నేలపై దొర్లుచు నా దేవునికి మొర్రపెట్టిన దినములు కూడా గలవు. నా గదిలోని బల్లలు కుర్చీల దగ్గర నేలపై నా ముఖము మోపి, "ప్రభువా నీవు నాకు తప్పక సాయంచేయాలి. నీవు సాయం చేయకపోతే నేను బ్రతకలేను" అని దేవునియెదుట ఏడ్చిన దినాలు ఎన్నో ఉన్నవి.

ప్రార్థించుట తప్పితే, నాకిక గత్యంతరము లేదన్నప్పుడు ప్రార్థిస్తే దేవుని గురించిన అనుభవాలు మనం ఎంతో ఎక్కువగా పొందగలము. చిన్న బిడ్డవలే ఏడ్చుచూ పూర్తిగా దేవునిపై ఆధారపడడం ఎంతో ఆరోగ్యదాయకము. మనం దేవునియెదుట ఏడ్చునప్పుడు, మన ముఖ కవళికలు ఎట్లున్నవి, మన స్వరం ఎట్లు ఇతరులకు వినబడుతుంది అన్న దిగులేమి అక్కరలేదు.

నేను దేవునియెదుట ఏడ్చినప్పుడు పనికిమాలిన బుద్ధిహీనురాలివలె కనబడియుంటానని నాకు తెలియును. దానినిబట్టి నాకేమి చింతలేదు.

## నీవు ఏదిశలో పయనించుచున్నావు?

"నాకు కొదువ కలిగినందున నేనీలాగు చెప్పుటలేదు; నేనేస్థితిలో ఉన్నను ఆ స్థితిలో సంతృప్తి కలిగియుండ నేర్చుకొని యున్నాను."

ఫిలిప్పీయులకు 4:11

నీవు ఉండాలనుకున్న స్థాయికి నీవింకా చేరుకోలేకపోతే దయచేసి నిరుత్సాహపడవద్దు. నీ చింతయావత్తు ప్రభువుపై మోపి, ఆయన నీడలో నివసించి ఆయన చాటున నివసించుటకు కొంత కాలము పడుతుంది; దానికి కొంత అనుభవం కూడా అవసరమే.

కనుక ఇప్పుడు "నీవెక్కడ ఉన్నావు?" అన్నది ముఖ్యమైన ప్రశ్న కానే కాదు గాని, "నీవు ఏ దిశలో పయనించుచున్నావు?" అన్నదే ప్రాముఖ్యమైన ప్రశ్న.

నేర్చుకునేస్థితి నీకిష్టమా?, నీప్రస్తుత స్థాయిని మార్చుకొనుటకు ఇష్టపడు చున్నావా? నీవు ఈ పుస్తకం చదువుతున్నావంటే అర్థమేమనగా, చింతను, దిగులును, భయాన్ని జయించుటకిష్టపడుతున్నావని విదితమౌతుంది. నీ చింత యావత్తు ప్రభువుపై వేసి అనవసరమైన వాదోపవాదములలో నిమగ్నుడవు కాకుండా ఉండుటకు నీకు కొంత అనుభవం ఇప్పుడు అవసరము.

## నీ బాధ్యత తప్పక నెరవేర్చాలి.
## కాని నీచింత యావత్తు ప్రభువుపై వేయాలి

"నీ పనుల భారము యెహోవామీద నుంచుము. అప్పుడు నీ ఉద్దేశములు సఫలమగును"

సామెతలు 16:3

అన్నిటిని గురించిన ప్రణాళిక నేను ముందుగానే ఎందుకు తయారు చేసి కొంటానంటే, ఒకవేళ అట్లు చేయకపోతే నా భాధ్యతలో నేను తప్పిపోతానేమోనని భయపడుతుంటాను. నేను ఎల్లప్పుడు బాధ్యతగల వ్యక్తిగా వ్యవహరించే దానను కనుక నాకు అప్పగింపబడిన బాధ్యతలో తప్పిపోతానేమోనని భయపడుతుంటాను. నేను బాధ్యత తీసికొనుట మాత్రమే గాక, దానితో పాటు "చింతను" కూడా నా వెంటపెట్టుకొంటూ ఉంటాను.

దేవునియొక్క కోరిక ఏమిటంటే మనకిచ్చిన బాధ్యతలను మనం చక్కగా నిర్వర్తించాలని, గాని మన చింతయావత్తు ఆయనపై వేయాలని ఆయన కోరుతాడు. ఎందుకు ఆలాగున ఆయన కోరుతాడు? కారణం ఏమిటంటే ఆయన మనలను గురించి చింతించుచున్నాడు.

మీరెట్లు ప్రవర్తిస్తారో నాకు తెలియదు గాని, నేను ఆనేక సంవత్సరాలు చింతతో దిగులుతో నన్ను నేను బాధపరచుకొన్నాను. ఎందుకంటే నేను చేయలేని సంగతులు చేయబూనుకొన్నాను, నాకు పట్టని సంగతులు కూడా చేయ ప్రయత్నించాను. ఆ విధంగా నా జీవితంలో ఎన్నో సంవత్సరాలు నష్టపరచు కొన్నాను.

నీ ప్రాణమును ఆయాసపరచుకొనగోరితే, అటు యిటు తిరుగుచు నీకు చేతగాని సంగతులు చేయడానికి ప్రయత్నించు. నీవు ఆ విధంగా చేస్తే భరించలేని ఆయాసంతో నిండిపోగలవు.

## ఫరవాలేదులే అని చెప్పడం నేర్చుకో

"కోపము మానుము ఆగ్రహము విడిచిపెట్టుము వ్యసనపడకుము అది కీడుకే కారణము కీడు చేయువారు నిర్మూలమగుదురు."

కీర్తనలు 37:8

నేను చేయలేని సంగతులు చేయవలసివచ్చినప్పుడు, నేను ఒక కొత్త మార్గము ఏమి కనుగొన్నానంటే నా చింత యావత్తు దేవునిపై వేయుటద్వారా వాటిని సునాయాసంగా చేయగలనని. అనగా కష్టమైనవి అయినప్పటికి, ఫరవాలేదు నేను చేస్తాను అని చెబుతాను.

ఉదాహరణకు డేవ్ ఒక ఉదయం కారులో వెళ్లేటప్పుడు నారింజరసాన్ని ఒలక బోసుకున్నాడు. ఆరసంలో కొంత నా చలికోటుమీద కూడా పడింది. అప్పుడాయన, "సాతానా! ఎంత పని చేశావురా?" అన్నాడు. అది గమనించి నేను "ఏమి ఫరవాలేదు, నాకోటు మీద పడినా ఫరవాలేదు" అన్నాను. అందువల్ల సమస్య లేకుండా పోయింది. ఇక దినమంతా సంతోషంగానే గడిచింది.

కొందరు ప్రతి దానికి చింతపడతారు. అసలు చింత పడనవసరము లేని వాటిని గురించి కూడా చింతపడతారు. దురుదృష్టవశాత్తు ఎంతోమంది క్రైస్తవులు విసుగుచెంది, ఎప్పుడు ఏదో ఒక దాని గురించి దిగులు పడతారు. అయితే వారిని కలవరపరచే సంగతులు పెద్ద పెద్ద విషయాలేమి కాదు. చిన్న చిన్న విషయాలు వారనుకున్నట్లు జరుగకపోతే వాటి విషయమై వారు చింతపడతారు. "ఏది ఎట్లయినా ఫరవాలేదులే" అని చెప్పే దానికి బదులు, తాము ఏమి చేయలేని వాటి విషయం ఏదయినా చేద్దామని తాపత్రయపడతారు.

"ఏమి ఫరవాలేదులే" అన్న మాటలు అనేక విషయాల్లో నాకు సాయపడ్డాయి.

మా కుమారుడైన 'డాని' ఒక రోజు బడిలో తనకు అప్పగింపబడిన ఒక పనిని పూర్తిచేయుటకు త్వరత్వరగా చేస్తుండినాడు. దాని విషయమై తాను వ్రాసిన కాగితపు చివరి భాగంలో కొంత తప్పు జరగడం గమనించి, ఆ కాగితాన్ని నలిపి పారేశాడు. అతడు ఇంకొక కాగితాన్ని తీసికొని మరలా మొదటనుంచి వ్రాయ సాగాడు గాని, విసుగుచెంది ఆ పనిని పూర్తిగానే మానివేయుటకు పూనుకొన్నాడు.

కనుక నేను, వాళ్ల తండ్రి ఇద్దరము కలిసి అతనిని ప్రోత్సహించి, "ఫరవాలేదు!" మళ్లీ చేయమన్నాము. ఆ మాటను బట్టి అతడు ప్రోత్సహించబడి తన పనిని

పూర్తి చేశాడు. ఎప్పుడైనా ఏ పనియైనా తాను చేయుటకు విసిగిపోతే, "ఫరవా లేదులే" అనుకుని విసుగుదలను విడిచిపెట్టి చేయవలసిన దానిని పూర్తి చేస్తాడు.

## నిబ్బరమైన బుద్ధి కల్గియుండండి

"నిబ్బరమైన బుద్ధిగలవారై మెలకువగా ఉండుడి..."

1 పేతురు 5:8

కొన్నిసార్లు, క్లిష్టమైన సందర్భాలలో, మనం జరిగించవలసిన పనులు జరిగించకుండా 'దిగులు' అడ్డం వస్తుంది. మనం చేయవలసినదంతా చేసిన తరువాత మిగతాకార్యంలో దేవుని నమ్మి ఆయనపై భారం మోపాలి.

మన మనస్సు ప్రశాంతంగా, నిబ్బరమైనదిగా నున్నప్పుడు, మనం పనులు చక్కగా జరిగించగలము. మన మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడు, అట్టి మనస్సులో చింతగాని, భయముగాని, దిగులు గాని ప్రవేశించలేవు. మన మనస్సు నిబ్బరంగా ఉన్నప్పుడు, మనం పరిస్థితులను చక్కగా పరిశీలించి, ఏ పని చేయవచ్చు, ఏ పని చేయకూడదు అన్నదానిని నిర్ణయించుకోగలము.

నిబ్బరమైన బుద్ధి కల్గియుండక పోవుటను బట్టియే మనము కష్టముల పాలవుతాము. నిబ్బరము లేనప్పుడు ఏ పని చేయక దేవుడే చూసుకుంటాడులే అనుకొని చేతులు ముడుచుకుంటాము. లేదా ఎంతో తొందరగా చకచకా శరీరానుసారంగా చేయడానికి అలవాటు పడతాము. మనము నిబ్బరము కల్గి "ఈస్థితిలో నేనింతవరకు చేయగలను" అని చెప్పే సమతుల్యమైన మనస్సు గల్గియుండాలని ప్రభువు కోరుతున్నాడు.

ఆదాయపు పన్ను చెల్లించే ఆఖరితేది దగ్గరకు వచ్చినప్పుడు ఈ నిబ్బరమైన బుద్ధి యొక్క అవసరత తెలిసికోగలము. దీనిని చెల్లించడానికి, సంవత్సరమంతా అప్పుడప్పుడు కొంతకొంత చెల్లిస్తాము. కాని చివరిలో ఇంకా డబ్బు చెల్లించాలని

తెలుపబడుతుంది. సమయం చాలా తక్కువగా ఉండడం వల్ల అంత డబ్బు వెంటనే ఎక్కడ నుండి సంపాదించాలని కలత చెందుతాము.

అటువంటి పరిస్థితిలో నిస్త్రాణముగలవారముగా నుండక, దేవుని యొద్దకు వెళ్లి, "దేవా ఈ పరిస్థితిలో నీవు నాకు సాయం చేస్తావని నమ్ముతున్నాను. నేనేమి చేయవలెనో నాకు తెలుపుము" అని అడగాలి.

డబ్బు ప్రభుత్వం వారికి చెల్లించడానికి, దేవుడు ఏదైన తీరిక సమయంలో చేసే ఉద్యోగం చూపించవచ్చు. లేక ఎక్కడనుండియైనా అప్పు పుచ్చుకొని దానిని త్వరగా తిరిగి చెల్లించే ఉపాయము నీకు చూపించవచ్చు. దేవుడు మనకు చూపించిన దానిని కడు జాగ్రత్తతో నిర్వర్తించాలి. ఆ తరువాత దేవుడు సహాయం చేస్తాడని నమ్మాలి.

కొన్నిసార్లు మన సమస్య పరిష్కరించడానికి కావలసినంతకంటే ఎక్కువ సంపాదన కొరకు ప్రయత్నిస్తాము. అయితే దేవుని నడిపింపు లేక తొందరపడి దేనినైనా చేసినట్లయితే, మనం శరీరానుసారంగా చేసిన వారమగుదుము గనుక వ్యర్థులమౌదుము. "ఇప్పుడు మరి నీవేమి చేయబోతావు?" అని మన మనస్సు గొడవ పెట్టినా కొన్నిసార్లు మౌనం వహించుట ఆశీర్వాదకరంగా ఉండును.

మనకు తెలిసిన దానికంటే ఎక్కువగా మనం చేయాలని మన ప్రేమగల దేవుడు కోరడు. మనము చేయగలిగినంత చేసిన తరువాత మిగతా సంగతులు దేవుడు చేస్తాడన్న నమ్మకంతో ఆయనకు వదలివేయాలి. అట్లు చేయు పనినే నేను సమతుల్యం గల విశ్వాసమని అంటాను.

## సమతుల్యంగల విశ్వాసియైన మనష్యుడు

"అబ్రాహాము పిలువబడినప్పుడు విశ్వాసమునుబట్టి ఆ పిలుపునకు లోబడి, తాను స్వాస్థ్యముగా పొందనైయున్న ప్రదేశమునకు బయలువెళ్లెను."

హెబ్రీయులకు 11:8

అబ్రాహాము సమతుల్యంతో కూడిన విశ్వాసం గల మనుష్యుడు. ఆయన ఉన్న పరిస్థితిని గూర్చి కొంత ఆలోచిద్దాము.

అబ్రాహాము దేవుని పిలుపు విన్నప్పుడు దేశమును, కుటుంబసభ్యులను, స్నేహితులను వదలి, తనకు తెలియని ప్రదేశానికి వెళ్లుటకు కట్టినాడు.

అప్పుడేమి జరిగిందో నేను ఊహించుకుంటున్నాను. అతడు వేసే ప్రతి అడుగులో సాతాను అతని చెవిదగ్గర చేరి, “ఓరి బుద్ధిహీనుడా, ఎక్కడికి వెళుతున్నావో నీకు తెలుసా? రాత్రి సమయంలో ఎక్కడ గడుపుతావు? ఎక్కడ నిద్రిస్తావు? ఏమి తింటావు? అబ్రాహామా ఎందుకు ఈ విధంగా బయటికి వచ్చావు? ఇది దేవుడు చెప్పిన విధానమని ఎందుకు తలస్తున్నావు? నీకు గాక మరెవరికైనా ఇట్లు దేవుడు చెప్పడం నీకు తెలుసా?” ఈ విధంగా సాతాను అతనితో మాటలాడి ఉంటాడు.

## మీ మనస్సులో కలవరపడవద్దు

“అప్పుడాయన–మీరెందుకు కలవరపడుచున్నారు? మీ హృదయములలో సందేహములు పుట్టనేల?”

లూకా 24:38

సాతాను అతని చెవులలో గగ్గోలు పెట్టినప్పటికి, అబ్రాహాము ముందుకు సాగిపోయాడు. బైబిలులో మనం చదువుతున్న రీతిగా, అబ్రాహాము ఎక్కడికి వెళ్లవలెనో అది ఎరుగకయే బయలు వెళ్లెను. అతడు మనస్సులో కలత చెందలేదు. (హెబ్రీ 11:8)

కొన్నిసార్లు మన మనస్సును మనమే కలవరపెడతాము. అపవాది ఏదో ఒక దానిని గురించి కలవరపరచకపోయినను, ఏదో ఒక సమస్యను త్రవ్వి పైకి తీసి దానిని గురించి చింతించ ప్రయత్నిస్తాము.

మన మనస్సును గురించి కొంత ఆలోచిద్దాము. మన మనస్సు దేనితోనిండి ఉండాలని దేవుడు కోరుతున్నాడో తెలుసా? దేవుని గూర్చిన స్తుతితో, దేవుని వాక్యంతో, ఇతరులను ప్రోత్సహించే మాటలతో, వారికి క్షేమాభివృద్ధి కలిగించే మాటలతో, నిరీక్షణతో, విశ్వాసంతో మన మనస్సు నిండి ఉండాలి.

అయితే, నిజానికి మన మనస్సులో ఉన్న సంగతుల జాబితా వ్రాద్దాము. మనలో చాలామంది దుఃఖముతో ఒప్పుకొనవలసినదేమనగా మన మనస్సులు, చింతతో, విసుగుదలతో, భయంతో, పోట్లాటలతో, తప్పుడు పథకాలు వేయుటతో, ఆయా ప్రణాళికలు తయారు చేయుటతో ఊహలతో, సందేహములతో, దిగులుతో, మరియు నెమ్మదిలేని స్థితితో నిండియుంటాయి.

అందువల్ల మన విశ్వాసముయొక్క గేట్లు తెరవబడక బూజుపట్టాయి. మనము మన విశ్వాసపు గేట్లకు పట్టిన బూజు దులిపి వాటిలో పరిశుద్ధాత్మ నూనెను పోసి సుళువుగా తెరుచుకొనునట్ల చేయాలి. ఇంతకాలం నుండి ఆ యొక్క విశ్వాసపు గేట్లు తెరచుకొనక ఇప్పుడు అకస్మాత్తుగా తెరచుకొనుటకు కష్టమైనప్పటికిని తగిన ప్రయత్నంచేసి మనం తెరవాలి.

అబ్రాహాము వలె మనం విశ్వాసముతో బయలు వెడలి, నమ్మకంతో ప్రభువు మనకు తగిన విశ్రాంతి దయచేస్తాడని నమ్మాలి. దాని విషయం మన మనస్సులో కలవరం చెందకూడదు.

నీ జీవితం వృథా చేసికోవద్దు నీ బాధ్యత ఏమిటో నీవు గుర్తించి దానిని నిర్వర్తించుటకు తీర్మానించుకో. ఆయన నిన్నేమి చేయగోరుతాడో దానిని జరిగించు. చేయలేని దానిని ఆయనకు అప్పగించు. నీ బాధ్యతను నిర్వర్తించు, కాని చింతించవద్దు.

# ముగింపు

మనము ఇంతకు మునుపు పరీక్షించిన విధముగా కీర్తనలు 91:2 వచనములో నున్న వర్తమాన భావము మరియు కీర్తనలు 91:1వ వచనములోనున్న వర్తమాన భావము ఒకే విధముగాయున్నవి.

> "మహోన్నతుని చాటున నివసించువాడే సర్వశక్తుని నీడను విశ్రమించువాడు."
>
> "ఆయనే నాకు ఆశ్రయము నా కోట నేను నమ్మకొను నా దేవుడని నేను యెహోవానుగూర్చి చెప్పుచున్నాను."
>
> కీర్తనలు 91:1,2

## మన ఆశ్రయము, మన కోట

పై రెండు వచనాలలో మనము నేర్చుకొనే పాఠమేదనగా, మనము చింతించనక్కర లేదు, దిగులుతో నుండుట మంచిది కాదు, విసుగుచెందనక్కరలేదు. ఎందుకనగా మనము దేవునియందు నమ్మికయుంచి ఆయనలో ధైర్యము కల్గియుండగలము.

2వ వచనములో వ్రాసియున్న రీతిగా, దేవుడే మన ఆశ్రయము, ఆయనే మన కోట.

'ఆశ్రయము' మరియు 'కోట' అనునవి రెండునూ రెండు విధములైన అర్ధమునిచ్చును. 'ఆశ్రయము' అనగా శత్రువు మనలను చూడలేని స్థలము, దాగుకొనుచోటు. మనము దేవునిలో దాగుకున్నప్పుడు సాతాను మనలను చూడలేడు. మనము దేవునిలో ఉండి బయట ఏమి జరుగుతుందో చూడగలము గాని అపవాది మనలను చూడలేడు. ఎందుకనగా సర్వశక్తుని నీడను మనము దాగుకొని వాని కనుదృష్టికి మరుగైనవారముగా ఉన్నాము.

'కోట' అనునది మనకు రక్షణకరమైన స్థలము. మనము కోటలో ఉన్నామని శత్రువుకు తెలియును గాని దానిలోనికి వాడు రాలేడు. ఎందుకనగా అతడు మన దగ్గరకు రాలేకుండా అడ్డము వేయబడినది. పడమటి దేశాలలో చూపించు సినిమాలలో సైనికులు వారి చుట్టు చెక్కలతో బలమైన గోడ కట్టుకున్నట్లు చూపిస్తారు. ఆ విధంగా మనము మన పరిస్థితిని అర్ధం చేసికోవచ్చు.

శత్రువు చూడలేని స్థలములో మనము దాగుకొనే ఏర్పాటున్నది: లేక, శత్రువు మనలను చూస్తున్నప్పటికి వాడు మన దగ్గరకు రాలేకుండునట్లు దేవుని కాపుదల అనుకోటలో మనము భద్రముగా ఉండగలము.

2వ వచనము మొదటి వచనము వలెనే ఎంతో ప్రాముఖ్యమైనది. ఎందుకంటే, ఈ అధ్యాయములోని ఐశ్వర్యవంతమైన వాగ్ధానములన్ని ఈ వచనములలోని షరతులపైననే ఆధారపడియున్నవి. "నీ (విధేయతగలసేవా) మార్గములన్నిటిలో నిన్ను కాపాడుటకు ఆయన నిన్ను గూర్చి (ప్రత్యేకముగా) తన దూతలకు ఆజ్ఞాపించును" (11వ) అన్న వాగ్ధానము, 1,2 వచనములలోని షరతులను నెరవేర్చువారమైతే మన జీవితములో వాగ్దానపు నెరవేర్పు అనుభవించగలము.

## ఆయనపైని ఆనుకొని ఆధారపడుము

"క్రీస్తుయేసునందు మీకు కలిగియున్న విశ్వాసమును గూర్చియు... మేము విని యెల్లప్పుడు..." (అనగా నీ పూర్ణమైన మానవ వ్యక్తిత్వాన్ని

ఆయనపై ఆనుకొనచేసి, ఆయన శక్తిని గూర్చి, జ్ఞానమును గూర్చి, మంచితనమును గూర్చిన పూర్తి విశ్వాసము గల్గియున్న స్థితిని చూచి)
కొలొస్సయులకు 1:4

కీర్తనలు 91:2వ వచనములో "నేను యెహోవాను గూర్చి చెప్పుచున్నాను" అన్న మాటలు చూడండి. చెప్పుచున్నాను అనగా పెదవులతో పలుకుట మాత్రము కాదు. లేక కంఠస్థము చెయుటమాత్రము కాదు. గాని మనము పూర్తిగా ఆయనను నమ్ముకొన్నాము, ఆయనయందు పూర్తి ధైర్యముగలవారమై యున్నాము, ఆయనపై పూర్తిగా ఆనుకొనుచున్నాము అని అర్థము.

కొలొస్సయులకు 1:4లో చెప్పబడిన రీతిగా విశ్వాసము యొక్క నిజమైన అర్థము అదే! అనగా మన సంపూర్ణ మానవ వ్యక్తిత్వాన్ని ఆయనపై ఆనుకొనచేసి, దేవుని శక్తియందు, జ్ఞానమందు, మంచితనమందు పూర్తిగా నమ్మికయుంచి ధైర్యము కలిగియుండుట.

కొంత కాలము క్రిందట మనము సామాన్యంగా ఎట్లు ఆయనపై ఆధారపడుతూన్నామో అన్న విషయం దేవుడు నాకు చూపించాడు. మనకున్న భయాలను బట్టి మనము దేవునిపై కొంత ఆధారపడతాము. కాని ఎక్కువ బరువు మన పాదములపైన ఉండనిస్తాము. ఎందుకంటే దేవుడు అటు జరిగిపోతే మనం మన పాదములపైనైనా ఆధారపడతాము.

మనము దేవునిపై పూర్తిగా ఆనుకొనని స్థితి ఎట్లుండునో మనం చెప్పవచ్చు. మన తలంపులు ఈ విధంగా ఉండును; "దేవా, నేను నిజంగానే నిన్ను నమ్ముకున్నాను. ఒకవేళ నీవు నాకు సాయంచేయకపోతే, నేను ఆధారపడ గల్గిన వేరే ఏర్పాటు నాకుందిలే" అంటాము.

ఆ విధంగా ఉండడం దేవుని పూర్తిగా నమ్ముకున్నట్లుకాదు. అయితే ఆయనను నమ్ముకునే విషయంలో ఎటువంటి ప్రలోభము మనకుండకూడదు. ఆయన తప్పిపోతాడేమో అని అనుకొనగూడదు.

ప్రభువు నీకు ఆశ్రయముగానున్నాడా? ఆయన నీకు నిజంగా కోటగా నున్నాడా? ఆయనపై ఆనుకొని ఆయనపైన మాత్రమే ఆధారపడుచున్నావా? లేక కేవలము నీ పెదవులతో మాత్రమే ఆయనను ఆధారంగా ఉంచుకొన్నావా?

మొదటి రెండు వచనాలు నీ జీవితంలో అనుభవంగా చేసుకుంటే 91వ కీర్తనలోని అధ్భుతమైన ఆశ్చర్యకరమైన వాగ్దానాలన్ని నీ పరమౌతాయి.

## ఆయన నిన్ను విడిపించి, నిన్నుకప్పును

(అప్పుడు) "వేటకాని ఉరినుండి ఆయన నిన్ను విడిపించును. నాశనకరమైన తెగులు రాకుండ నిన్ను రక్షించును."

(అప్పుడు) "ఆయన తన రెక్కలతో నిన్ను కప్పును ఆయన రెక్కల క్రింద నీకు ఆశ్రయము కలుగును. ఆయన సత్యము కేడెమును డాలునై యున్నది."

కీర్తనలు 91:3,4

3,4 వచనములలోని ఈ ఆశ్చర్యకరమైన అద్భుత వాగ్ధానములలో మొదటిది దేవుడిచ్చు విడుదలను గూర్చి కాపుదలను గూర్చి మనకు బోధించుచున్నది.

యుద్ధసమయంలో కేడెము, డాలు ఈ రెంటిని ఉపయోగించువాని దేహమునంతటిని కప్పి శత్రువుయొక్క బాణములనుండివాని కాపాడును. కొన్ని కేడెములు నిలువుగా కాక గుండ్రముగానుండి కుడికైననూ, ఎడమకైనను త్రిప్పుకొని శత్రు బాణములనుండి తప్పించుకొనుటకు వీలుగానుండును.

డాలు అనునది చేతికి అమర్చబడిన చిన్న కేడెము. కొన్నిసార్లు దీనిని చేతితో పట్టుకొని ఉపయోగింతురు. యుద్ధంలో పోరాడువాడు దానిని చేతితో పట్టుకొని మరొకనితో కలబడినప్పుడు తన దేహముయొక్క కాపుదలకొరకు దానిని వాడుకొనును. కీర్తనలు 125:2లో వ్రాయబడిన రూపకమును ఈ సందర్భములో

మనము పోల్చుకొనవచ్చును. “యెరూషలేముచుట్టు పర్వతములున్నట్లు యెహోవా ఇది మొదలుకొని నిత్యము తన ప్రజల చుట్టు ఉండును.”

నీవు, నేను ఏ పరిస్థితిలో ఉండినప్పటికిని, “దేవుడు మనపక్షముననుండగా మనకు విరోధియెవడు?” (రోమా 8:31)

దేవుడు మనతో ఉన్నాడు. ఎందుకనగా “నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను” (హెబ్రీ13:5), అని ఆయన వాగ్ధానం చేశాడు. ప్రభువు క్రింద నుండి మనలను పైకెత్తుచున్నాడని (ఆదుకొనుచున్నాడని) ఆయన వాగ్ధానమిచ్చాడు. (కీర్తనలు 119:116) పైనుండి మనలను కాపాడుచున్నాడని కీర్తనలు 91:4లో వ్రాయబడింది.

“ఆయన తన రెక్కలతో నిన్ను కప్పును ఆయన రెక్కల క్రింద నీకు ఆశ్రయము కలుగును ఆయన సత్యము, కేడెమును డాలునై యున్నది.”

ఈ పాఠాన్ని స్థిరంగా ఎల్లప్పుడు నీ మనస్సులో నాటుకొని యుంచుకొనుము. ఆయన నీ పక్షముననున్నాడు. ఆయన నీతో ఉన్నాడు. సాతాను మాత్రమే నీకు నిజమైన విరోధి. సర్వోన్నతుని చాటున నీవు జీవించునంత కాలము, శత్రువు నిన్ను కనుగొనలేడు, నీ యొద్దకు రాలేడు.

ఇవి నిజమైన సంగతులైతే నీవెందుకు భయపడాలి?

## నీవు భయపడకూడదు

“రాత్రివేళ కలుగు భయమునకైనను, పగటివేళ ఎగురు బాణమునకైనను, చీకటిలో సంచరించు తెగులుకైనను, మధ్యాహ్నమందు పాడుచేయు రోగమునకైనను నీవు భయపడకుందువు.

నీ ప్రక్కను వేయి మంది పడినను, నీ కుడిప్రక్కన పదివేల మంది కూలినను అపాయము నీ యొద్దకురాదు.

నీవు కన్నులార చూచుచుండగా భక్తిహీనులకు ప్రతిఫలము కలుగును. యెహోవా నీవే నా ఆశ్రయము అని నీవు మహోన్నతుడైన దేవుని నీకు నివాసస్థలముగా చేసుకొని యున్నావు."

కీర్తనలు 91:5-9

దేవునిలో దాగుకొను విధానమును గురించి నీవు, నేను నేర్చుకొన వలసియున్నాము. ఆ చాటైన స్థలములో నుండుటకు మనము నేర్చుకొన గలిగినట్లైతే, సాతానుయొక్క నరములను బలహీనపడునట్లు చేయగలము. మనము నింపాదుగా కూర్చుండి వాడు మన యొద్దకు చేరుటకు చేయు వివిధ ప్రయత్నములను కనిపెట్టి చూచుచు, మనము వానికి చిక్కము గనుక వాడు మనలను చేరలేకయుండుట గమనించగలము.

కొన్ని సంవత్సరాలు క్రిందట దేవుడు నా జీవితంలో గొప్ప మార్పు కలుగ చేశాడు. నేను అప్పటికే రక్షింపబడి, పరిశుద్ధాత్మ బాప్తీస్మము పొందినప్పటికి అనేక సమస్యలతో సతమతమౌతుంటిని అప్పుడు దేవుడు తన సన్నిధిలో నివసించినప్పుడే నా జీవితంలో నిలుకడ కలిగియుండగలనని నాకు నేర్పించ ప్రారంభించాడు.

అప్పట్లో నా జీవితంలో నిండుకున్న ఒడుదుడుకులను బట్టి, నేను నిలకడగల జీవితానికి తాపత్రయపడుతూ ఉంటిని. నా పరిస్థితులు నన్ను శాసించుట నాకిష్టము లేకుండెను. నా శేష జీవితమంతా సాతానుపై పోరుపెడుతూ జీవించుటకు నా కిష్టము లేకుండెను. నేను దేవుని బిడ్డనైనందున బైబిలులో వాగ్ధానం చేయబడ్డ దీవెనలు అనుభవించాలని ఎంతో కోరిక గలదాననైయుంటిని.

అట్టి సమయంలో దేవుడు తన సన్నిధిలో నివసించు ప్రాముఖ్యతను గూర్చి నాకు నేర్పించాడు. ఎన్నో సంవత్సరాలుగా ఆయన సన్నిధిలో నుండుటను గూర్చి నేను అధ్యయనం చేశాను. దానిని నా జీవితంలో అన్వయింప చేసికొనుటకు ప్రయత్నించాను.

ఇప్పుడు, ఇన్ని సంవత్సరాలతరువాత నా జీవితంలో ఎంత మార్పు జరిగిందోనన్న విషయాన్ని గురించి నేను పూర్తిగా వివరించలేను. ఇప్పుడు నేను జీవితంలో సంతోషం కలిగి నిలకడగానున్నాను. అనగా నాకిప్పుడు ఏ సమస్య లేదని అర్థంకాదు. నాకు పోరాటాల సమయం అయిపోయిందని కూడా నేను చెప్పుట లేదు. అయితే సమస్యలు, పోరాటాలున్నప్పటికి, నేను ఆయన సన్నిధిలో నిలకడ కలిగి జీవితం గడపకల్గుతున్నాను.

91వ కీర్తనలు ఉద్రేకం కల్గించే మంచి వాంగ్మయ రూపకము మాత్రమే కాదు. అది సత్యమైనది. అది నిజమైనదని నా జీవితంలో అనుభవించాను.

చాటైన దేవుని సన్నిధిలో నివసించుటకు నీవు నేర్చుకొనియుంటే, సాతాను తన చేతిని నీపైన ఉంచలేడు. వాడు నిన్ను తన అదుపులో ఉంచుకోలేడు.

యెహోవాను నీవు నీ ఆశ్రయముగా చేసికొని మహోన్నతుని నీ నివాస స్థలముగా చేసుకొన్నట్లయినచో, భక్తిహీనులకు కలుగు ప్రతిఫలమును నీవు చూడగలవు. ఏ కీడు నీకు సంభవింపదు.

## ఏ కీడు నీకు సంభవింపదు

"నీకు అపాయమేమియు రాదు. ఏ తెగులును నీ గుడారమును సమీపించదు. నీ మార్గములన్నిటిలో నిన్ను కాపాడుటకు, ఆయన నిన్ను గూర్చి తన దూతలకు ఆజ్ఞాపించును.

నీ పాదములకు రాయి తగులకుండ వారు నిన్ను తమ చేతుల మీద ఎత్తి పట్టుకొందురు."

కీర్తనలు 91:10-12

మనము విధేయతతో ఆయన సేవలో ముందుకు సాగితే కాపుకాయు దేవుని దూత మనతో నుండునని బైబిలు (ఇంగ్లీషులో ఆంప్లిఫైడ్ వర్షన్) బోధించుచున్నది.

నాకు సహాయకురాలుగా నున్న ఒక స్త్రీ ఒక పడవలో కూర్చుని ఉంది. ఆమె కీర్తనలు 91:10 వచనాన్ని వల్లిస్తూ ఏ అపాయము నీగుడారము సమీపించదు అని చెప్పుకొనుచుండెను. అంతలో తానున్న ఆ పడవ ఒక పెద్ద అల తాకిడికి ఆమె ప్రక్కకు పడిపోయినందున తన తలకు దెబ్బ తగిలింది. కాపుదలను గురించి ఆ వచనము చెప్పుకొనుచుండగా, ఆమెకు ఆ దెబ్బ ఎట్లు తగిలినదోనన్న కలవరములో ఆమె ఉండెను. దాని విషయమై ఆమె ప్రభువునడిగింది. అందుకు ప్రభువు "నీవు మరణించలేదు కదా!" అని అన్నాడు. ఆమె అట్లు తలంచక పోయినను. దేవుని దూతలు ఆమెను కాపాడారు.

దేవుని దూతలు నిన్ను కాపుదల చేయుచున్నందువల్లనే ఎన్నోసార్లు చనిపోయే అవకాశము తప్పించుకున్నావు. నీవు అట్టిసమయాలను గుర్తుంచుకొనుటకు మరచిపోయి ఉండవచ్చు. దేవుడు మనకు చేయుదానిని మనం చూడలేక పోవుచున్నందున ఏ సాకు మనం చెప్పలేము. కాని ఆయన మన జీవితాలలో చేయుచున్న దానిని గురించి దేవుని స్తుతించుము.

## నీవు శత్రువును అణగత్రొక్కుదువు

"నీవు సింహములను, నాగుపాములను త్రొక్కెదవు కొదమ సింహములను భుజంగములను అణగ ద్రొక్కెదవు."

కీర్తనలు 91:13

లూకా 10:19 ఈ వచనానికి తగిన అనుబంధ వాక్యము. ఈ వాక్యమునందు సింహము, పాము, తేలు, భుజంగము అనువాటి యొక్క అర్థమును విశదీకరించుచున్నది. "ఇదిగో పాములను, తేళ్లను త్రొక్కుటకును, శత్రువు బలమంతటి మీదను మీకు అధికారము అనుగ్రహించియున్నాను; ఏదియు మీకెంతమాత్రమును హానిచేయదు." (లూకా 10:19)

సింహము, నాగుపాము, తేలు, ఇవన్నియు శత్రువును సూచించేవిగా ఉన్నవి. వాటిని మన పాదముతో నలిపివేయుటకు ప్రభువు మనకు అధికారము ఇచ్చియున్నాడు. దేవుడు మనకిచ్చిన అధికారము 'బదిలీ చేయబడిన అధికారము'. అనగా ఆ అధికారము యేసు ప్రభువు నుండి మనకు అనుగ్రహింపబడినది. మనకిష్టమైతే దానిని మనము ఉపయోగించవచ్చు, శత్రువును కాలిక్రింద అణచవచ్చు. అదే మనకీయబడిన హక్కు, సరియైన స్థానము. దేవునిలో మనకు కలిగిన హక్కుదారుని స్థానము.

## మనము ఆయనను ప్రేమించుచున్నాము గనుక, ఆయన మనలను తప్పించును

"అతడు నన్ను ప్రేమించుచున్నాడు గనుక నేనతని తప్పించెదను. అతడు నా నామము నెరిగినవాడు గనుక నేనతని ఘనపరచెదను. (అతనికి నా కనికరము, ప్రేమ, దయను గూర్చిన వ్యక్తిగత అనుభవమున్నది అతడు నన్ను నమ్మి నాపై ఆధారపడుచున్నాడు. నేను అతనిని ఎన్నడు విడిచిపెట్టనన్న సంగతి అతడెరుగును.)

అతడు నాకు మొఱ్ఱపెట్టగా నేనతనికి ఉత్తరమిచ్చెదను. శ్రమలో నేనతనికి తోడైయుండెదను. అతని విడిపించి అతని గొప్ప చేసెదను."

కీర్తనలు 91:14,15

దేవుని దీవెనలు, కాపుదల పొందుటకు మనకు ఆయన నామమును గూర్చిన ఎరుక ఉండవలెను. మన తండ్రితోను, తల్లితోను, స్నేహితునితోను కల్గిన సంబంధంపై ఆధారపడి, దేవునితో సంబంధ బాంధవ్యములు పెంచుకోలేము. మనకై మనము దేవునితో సంబంధబాంధవ్యములు కలిగియుండవలెను. మనము దేవుని చాటైన స్థలములో నివసించుచూ ఆయనతో సమయం గడపాలి.

మనము అనేకసార్లు “నిన్ను విడిపించును” అన్న మాట వల్లిస్తూ “నన్ను విడిపించుము, నన్ను విడిపించుము, నన్ను విడిపించుము” అని మొఱ్ఱపెడతాము. అయితే విడుదల అనునది ఒక క్రమముననుసరించి జరుగును. మనకు ఆపద సంభవించినప్పుడు దేవుడు ఆపదలో మనతో ఉంటాడు. ఆయన మనలను బలపరచి ఆపదలో నుండి విజయవంతంగా బయటకు చేరుస్తాడు. ఆ తరువాత ఆయన మనలను విడిపించి మనలను ఘనపరుస్తాడు.

నా గత జీవితంలో కల్గిన బాధలనుండి విడిపించుకొనుటకు ప్రయత్నించు చుండగా, దేవుడు నా శ్రమలో నాతో కూడా ఉండెను. ఆ తరువాత నన్ను విడిపింప మొదలు పెట్టినప్పుడు నన్ను ఘనపరచ ప్రారంభించెను.

నీకు కష్టము కలిగినప్పుడు నీవు ఫోను దగ్గరకు పరుగెడతావా? లేక దేవుని సింహాసనము నొద్దకు పరుగెడతావా? మొదట్లో కొంత కష్టమనిపించినా, నీకు శ్రమ కల్గినప్పుడు మనుష్యులయొద్దకు వెళ్లుటకంటే, దేవుని యొద్దకు వెళ్లుటకు నేర్చుకోవాలి. వారి సమస్యలను వారికైవారు పరిష్కరించుకోలేని వారి యొద్దకు వెళ్లుట వల్ల నీ సమస్యను పరిష్కరించుటలో ఏ లాభం చేకూరదు.

మనలో చాలామంది మనుష్యులు, మన జీవితాలను చక్కగా నడుపుకొనుటలో నిమగ్నులమై యుంటాము! ఇతరులకు సరియైన సలహా ఇచ్చుటకు తగిన సమయం మనకుండదు.

కనుక దేవునియొద్దకు వెళ్లడం నేర్చుకో. దేవుని రహస్యస్థలమునకు, చాటైన నివాసమునకు, ఆ దాగుకొను స్థలమునకు వెళ్లుటకు నేర్చుకో. అన్నిటికంటే ప్రప్రథమంగా దేవునియొద్దకు వెళ్లుటకు నేర్చుకొని ఈలాగు ప్రార్థించుము. “ప్రభువా నాకు సాయంచేయుటకు ఎవరినైనా వాడుకొనుటకు నీకిష్టమైతే ఆ వ్యక్తిని అభిషేకించండి. నేను ఫలాని రీతిగా చేయాలని వారు నన్ను శాసించుట నాకిష్టము లేదు. మీరే నాతో మాటలాడండి. ఇతరుల సాయం వ్యర్థము.”

## దీర్ఘాయువుతో తృప్తి పరచెదను

"దీర్ఘాయువుచేత అతనిని తృప్తిపరచెదను నా రక్షణ అతనికి చూపించెదను."

కీర్తనలు 91:16

శరీర సంబంధమైన పాపములు, అనగా, త్రాగుడు, మాదకద్రవ్యముల ఉపయోగము, లైంగిక పాపములు, మరణమునకు నడిపించునని మనము సుళువుగా చెప్పవచ్చు. అయితే అతిగా చింతించుట, దిగులు, వాదోపవాదాలు అంతగా హానిచేయవని అనుకుంటాము. వాటిని పాపముల క్రింద పరిగణించము. నిజానికి ఈ లక్షణాలు కూడా మన శరీరాలపై ప్రభావము చూపి, గుండెపోటు, కడుపులోని పుండ్లు అధిక రక్తపోటు మొదలగు లక్షణములకు కారణములై తొందరగా మరణమునకు దారితీయును.

జీవిత దారిలో నీవు పయనించునప్పుడు, సాతాను నీపై దాడిచేసే సమయంలో, కీర్తనలు 91:1,2 వచనాలలో దేవుని ఆజ్ఞలను నీ అనుభవంలో పెట్టుకొని, మహోన్నతుని చాటున నివసించుటకు, సర్వశక్తుని నీడను విశ్రమించుటకు నేర్చుకొని, ఆయనపై ఆనుకొని, ఆయనను నీ ఆశ్రయముగా, కోటగా చేసికొనుము.

## సూచనలననుసరించి పొమ్ము

"అయితే నేను లేచిన తరువాత, మీకంటె ముందుగా గలిలయలోనికి వెళ్లెదననెను."

మార్కు 14:28

కనుక మనము అనుసరించవలసిన సూచనలేవనగా: (1) దేవునియందు విశ్వాసముంచి చింతించుట మానుకోవాలి. (2) భయపడవద్దు, దిగులుతో ఉండకూడదు. (3) ఎట్టి వాదోపవాదాలు లేక నీ చింతయావత్తు తీసి పారవేయాలి.

నీవు కుడికి గాని, ఎడమకు గాని తిరిగి త్రోవ తప్పిపోయేకంటే, ఈ సూచిక స్థంభాలను అనుసరింపకుండా కుడికి గాని ఎడమకు గాని తిరిగితే ఏదో ఒక గుంటలో పడే అవకాశముంది.

క్రైస్తవయాత్రలో త్రోవతప్పి పోవుటకు ప్రధాన కారణము అతిగా చింతించుటయే. యోహాను 15:5లో మనప్రభువు చెప్పినదేమనగా, "నాకు వేరుగా ఉండి, (అనగా నాతో ముఖ్యమైన సంబంధములేక) మీరేమియు చేయలేరు."

ఆ వచనమును ధ్యానించి, ఆ వచనము నిన్ను గట్టిగా పట్టుకొననిమ్ము. చింతించుటవలన నీపరిస్థితిలో ఏ మార్పు జరుగదు. నీకు విశ్వాస సహితమైన దృక్పధముంటే, చింతించుట దూరమౌతుంది. రేపటిని గూర్చిన ఆయాసము దిగులు కూడా దూరమైపోతాయి.

దానికి కారణమేమనగా విశ్వాసముతో ఎక్కడికి పోవుట అవసరమో, అక్కడికి ముందుగానే యేసు వెళ్లాడని విశ్వాసికి తెలుసు.

నీ జీవితంలో కలిగేప్రతిదానికి ఏమి కారణమున్నదని నొక్కి, నొక్కి అడగడం సరియైన పద్ధతికాదు. నీవు తెలిసికొనుటకు ఏది అవసరమో, ప్రభువు ముందుగానే బయలుపరుస్తాడు. సమస్తమును ఎరిగి, సమస్తమును బాగుగా చేయగల్గిన వానిని నీవెరుగుదువన్న తృప్తి కల్గియుండుటకు నేర్చుకొనుము.

రెండవ భాగము

# లేఖనభాగములు

# చింతించుటను జయించుటకు తగిన లేఖనభాగములు

నీవు ఈ వాక్యములను చదివి, వాటిని ఒప్పుకొని, అనుసరించినయెడల, చింతించుట నుండి విడుదల పొంది సంతోషకరమైన జీవితం జీవించగలవు.

"ఒకని హృదయములోని విచారము దాని క్రుంగ జేయును దయగల మాట దాని సంతోషపెట్టును."

సామెతలు 12:25

"బాధపడువాని దినములన్నియు శ్రమకరములు సంతోష హృదయునికి నిత్యము విందు కలుగును."

సామెతలు 15:15

"ఎవనిమనస్సు నీమీద ఆనుకొనునో వానిని నీవు పూర్ణశాంతి గలవానిగా కాపాడుదువు. ఏలయనగా అతడు నీ యందు విశ్వాసముంచి యున్నాడు."

యెషయా 26:3

“అందువలన నేను మీతో చెప్పునదేమనగా – ఏమి తిందుమో, యేమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చియైనను, ఏమి ధరించుకొందుమో అని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి; ఆహారముకంటె ప్రాణమును, వస్త్రము కంటె దేహమును గొప్పవి కావా?” “ఆకాశపక్షులను చూడుడి; అవి విత్తవు కోయవు కొట్లలో కూర్చుకొనవు; అయినను మీ పరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు; మీరు వాటి కంటె బహు శ్రేష్టులు కారా?”

మత్తయి 6:25, 26

“కాబట్టి ఏమి తిందుమో, యేమి త్రాగుదుమో, యేమి ధరించుకొందుమో అని చింతింపకుడి, అన్యజనులు వీటన్నిటి విషయమై విచారింతురు.”

మత్తయి 6:31

“రేపటిని గూర్చి చింతింపకుడి, రేపటి దినము దాని సంగతులను గూర్చి చింతించును. ఏనాటికీడు ఆనాటికి చాలును.”

మత్తయి 6:34

“ఇతరులు ముండ్లపొదలలో విత్తబడినవారు; వీరు వాక్యము విందురు గాని ఐహిక విచారములును, ధనమోసమును మరి ఇతరమైన అపేక్షలును లోపల చొచ్చి, వాక్యమును అణచివేయుట వలన అది నిష్ఫలమగును.”

మార్కు 4:19

“శాంతి మీ కనుగ్రహించి వెళ్ళుచున్నాను. నా శాంతినే మీ కనుగ్రహించుచున్నాను. లోకమిచ్చునట్టుగా నేను మీ

కనుగ్రహించుటలేదు. మీ హృదయమును కలవరపడనియ్యకుడి వెరవనియ్యకుడి."

యోహాను 14:27

"మీరు చింతలేనివారై యుండవలెనని కోరుచున్నాను. పెండ్లికానివాడు ప్రభువును ఏలాగు సంతోషపెట్టగలనని ప్రభువు విషయమైన కార్యములను గూర్చి చింతించుచున్నాడు."

1 కొరింథీయులకు 7:32

"దేనినిగూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనములచేత కృతజ్ఞతాపూర్వకముగా మీ విన్నపములను దేవునికి తెలియజేయడి. అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసుక్రీస్తు వలన మీ హృదయములకును మీ తలంపులకును కావలి యుండును."

ఫిలిప్పీయులకు 4:6,7

"మెట్టుకు సహోదరులారా, యే యోగ్యతయైనను, మెప్పైనను ఉండినయెడల, ఏవి సత్యమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతిగలవో, వాటిమీద ధ్యానముంచుకొనుడి."

ఫిలిప్పీయులకు 4:8

"ఆయన మిమ్మునుగూర్చి చింతించుచున్నాడు గనుక, మీ చింత యావత్తు ఆయనమీద వేయుడి."

1 పేతురు 5:7

# చింతించుటను జయించుటకు ప్రార్థన, ఆశీర్వాదము

ఇప్పుడు నేను మీకొరకు ప్రార్థించి గొప్ప ప్రోత్సాహమును గూర్చిన మాటలతో మిమ్మును పంపించ కోరుచున్నాను:

*"తండ్రీ, చింతింపకుండుటకు నాకు సహాయము చేయండి. చింతించుటవలన మేలుకలుగదని నేను తెలిసికొన్నాను. పైగా నా స్థితి చింతించుటవల్ల క్షీణించును. గనుక నీ రాజ్యమునకు, నాకు మేలుచేయు సంగతులపైననే నా మనస్సు నిలుపుకొనుటకు సాయపడండి.*

*ప్రభువా నా విషయమై మీరు జాగ్రత్తవహించుచున్నందుకు మీకు వందనములు. నా జీవితము విషయమై మీరు మంచి ప్రణాళిక కల్గియున్నారు. ఆ ప్రణాళికలోనికి వచ్చుటకు తగినట్లుగా నేను నడుచుకుంటాను. నీయందు, నీవాక్యమునందు నా పూర్తి విశ్వాసముంచుచున్నాను. మీరు నా విషయమై చింతించుచున్నారు గనుక నా చింతయావత్తు మీ మీద వేయుచున్నాను."*

*యేసు నామమున అడుగుచున్నాను.*
*ఆమెన్.*

# ప్రభువుతో వ్యక్తిగతమైన సంబంధంకొరకైన ప్రార్థన

సమాధానకర్తయైన యేసు ప్రభువును నీవు ఇంతవరకు నీ స్వంత రక్షకునిగా, ప్రభువుగా అంగీకరించనియెడల, ఈ క్రిందివిధంగా నీవు ప్రార్థించుము. క్రీస్తులో నూతనమైన జీవితమును నీవు అనుభవించగలవు.

*"తండ్రీ,*

*నీవు లోకమును ప్రేమించి నీ అద్వితీయ కుమారుడైన యేసు క్రీస్తునందు విశ్వాసముంచు ప్రతివాడును నిత్యజీవముపొందునట్లు ఆయనను అనుగ్రహించితివి. మేము కృపద్వారానే విశ్వాసము వలన రక్షణ పొందితిమని నీ వాక్యము వెల్లడించుచున్నది. రక్షణను సంపాదించుకొనుటకు మేమేమియు చేయలేము.*

*నీ కుమారుడైన యేసు క్రీస్తు లోకరక్షకుడని నా నోటితో ఒప్పుకొనుచూ విశ్వసించుచున్నాను. ఆయన సిలువపై నా కొరకు చనిపోయి నా పాపమంత తనమీద మోపుకొన్నాడని వాటి క్రయమంతా చెల్లించాడని, ఆయన చనిపోయిన తరువాత మీరు ఆయనను లేపినారని నమ్ముచున్నాను.*

*నా పాపములు క్షమించుమని మనవి చేయుచున్నాను. యేసును నా ప్రభువుగా ఒప్పుకొనుచున్నాను. నీ వాక్యమునందు తెలియజేయబడిన రీతిగా నేనిప్పుడు రక్షణ పొందితిని. నిత్యత్వము నీతోనే గడుపుదును. తండ్రీ నీకు వందనములు. నీకు నేను కృతజ్ఞుడను. యేసు నామమందు అడుగుచున్నాను. ఆమెన్.*

**ఈ క్రింది వచనాలు చదవండి.**

యోహాను 3:16; ఎఫెసీ 2:8,9; రోమా 10:9,10;
1 కొరింథీ 15:3,4; 1 యోహాను 1:9; 4:14,16; 5:1,12,13.

# రక్షణ కొరకు ప్రార్థన

దేవుడు నిన్ను ప్రేమిస్తున్నాడు మరియు ఆయన నీతో వ్యక్తిగత సంబంధమును కలిగియుండాలని ఆశిస్తున్నాడు. నీవు ఇంకను యేసును నీ స్వంతరక్షకునిగా అంగీకరించనియెడల ఇప్పుడే దానిని చేయుము. మీరు కేవలం మీ హృదయమును ఆయన కొరకు తెరచి ఈ ప్రార్థనను చేయుము.

"తండ్రీ, నేను నీకు వ్యతిరేకముగా పాపము చేసియున్నానని నాకు తెలియును. నన్ను క్షమించుము. నన్ను శుద్ధునిగా చేయుము. నేను మీ కుమారుడైన యేసులో నమ్మికయుంచుదునని వాగ్దానం చేయుచున్నాను. ఆయన నాకొరకు మరణించియున్నాడని – ఆయన సిలువపై మరణించినప్పుడు నా పాపములన్నింటిని ఆయన మోసాడని నేను నమ్ముదును. ఆయన మరణము జయించి తిరిగి లేచాడని నేను నమ్ముచున్నాను. నేను ఇప్పుడే నా జీవితమును యేసుకు అర్పించుచున్నాను.

తండ్రీ, మీ క్షమాపణ మరియు నిత్యజీవమనే బహుమతులను బట్టి మీకు వందనము. నీ కొరకు జీవించుటకు నాకు సహాయం చేయుము. యేసు నామములో ప్రార్థించుచున్నాను. ఆమేన్."

నీవు నీ హృదయముతో ప్రార్థించినప్పుడు దేవుడు నిన్ను అంగీకరించి, పరిశుద్ధపరచి మరియు ఆత్మీయ మరణమనే బంధకము నుండి నిన్ను

విడిపించెను, సమయం తీసుకొని ఈ లేఖనమును చదివి మరియు ధ్యానించి మరియు మీ నూతన జీవితంలో ఆయనతో నడచుచున్న ఈ ప్రయాణంలో దేవుడు మీతో మాట్లాడునట్లు ఆయనను అడుగుము.

- యోహాను 3:16
- ఎఫెసీ. 1:4
- 1 యోహాను 1:9
- 1 యోహాను 5:1
- 1 కొరింథీ 15:3-4
- ఎఫెసీ 2:8-9
- 1 యోహాను 4:14-15
- 1 యోహాను 5:12-13

నీవు క్రీస్తుతో నీ సంబంధముతో ఎదుగుటకు ప్రోత్సహించబడునట్లుగా బైబిలును నమ్మే సంఘమును మీరు కనుగొనునట్లు దేవుని సహాయంకొరకు అడగండి. దేవుడెల్లప్పుడు మీతోనే ఉంటాడు మరియు దేవుడు మీ కొరకు దాచియుంచిన సమృద్ధియైన జీవితమును మీరు జీవించునట్లు ఆయన మిమ్ము్మను నడిపించును.

# రచయితను గురించి

జాయిస్ మేయర్ ప్రపంచంలోని ప్రసిద్ధిగాంచిన క్రియాపూర్వకమైన బైబిల్ బోధకులలో ఒకరు, ఆనందించుడి ప్రతిదిన జీవితం అనే ఆమె టివి మరియు రేడియో కార్యక్రమాలు ప్రపంచమంతటా వందలకొలది టివి నెట్‌వర్క్ మరియు రేడియో స్టేషన్స్‌లో ప్రసారమవుతుంది.

జాయిస్ వందల కంటే ఎక్కువ ఉత్తేజకరమైన పుస్తకాలను రచించారు. ఆమె పుస్తకాలలో ఉత్తమంగా అమ్ముడైన పుస్తకాలు – *గాడ్ ఈస్ నాట్ మ్యాడ్ ఎట్ యు; మేకింగ్ గుడ్ హ్యాబిట్స్, బ్రేకింగ్ బ్యాడ్ హ్యాబిట్స్; డు యువర్ సెల్ఫ్ ఎ ఫేవర్... ఫర్‌గివ్; లివింగ్ బియాండ్ యువర్ ఫీలింగ్స్; పవర్ థాట్స్; మనస్సే ఒక రణరంగం; లుక్ గ్రేట్ ఫీల్ గ్రేట్; ద కాన్ఫిడెంట్ వుమన్; ఐ డేర్ యు; మరియు నెవర్ గివ్ అప్!*

జాయిస్ ప్రపంచమంతటా అనేకమంది వేలమంది ప్రజలతో మాట్లాడునట్లు సంవత్సరమంతటా సదస్సులను నిర్వహిస్తూ విస్తారంగా ప్రయాణిస్తూ ఉంటారు.

Joyce Meyer Ministries—India
Post Bag No. 1
Jubilee Hills, Hyderabad
India
www.jmmindia.org

**Go to tv.joycemeyer.org to watch Joyce's messages in a variety of different languages.**

**You can also request Prayer on Toll Free number: 1800 3454 007**

## అన్ని సరియైన రీతిగానే క్షేమము కొరకు జరుగును!

చింతించుట నీ సమాధానమును హరించే పాపము. అది నీ శరీరమును దుర్బలత్వమునకు నడిపి, నిన్ను రోగిష్టునిగా చేయును. చింతించుట విశ్వాస జీవితమునకు విరుద్ధము గనుక నీకు ఏ మేలు చేయలేదు. నీకాళ్లపై నిలువబడి, నీ ప్రయత్నము వల్ల చింతించుటను దూరపరచుకొనచూచు చున్నట్లయితే, ఈ పుస్తకము సరిగ్గా నీ కోసమే వ్రాయబడింది.

ఎక్కువగా అమ్ముడుబోయే అనేక పుస్తకాలను రచించిన, జాయిస్ మేయర్ గారు, లేఖనములతో పాటు తన వ్యక్తిగత ఉదాహరణలు కూడా జోడించి, నీ భారమును ప్రభువుపై వేయుట ఎట్లో నీ వెరుగునట్లు ఇందులో పొందుపరచారు. దేవుని చాటైన స్థలములో ఎట్లు దాగియుండవలెనో అదే సమయములో నీ బాధ్యతలను ఎట్లు నెరవేర్చవలెనో, నీవు నేర్చుకొనుటకు వీలైన శక్తివంతమైన రహస్యములను ఇందులో అందుబాటులోకి తెచ్చారు. నిర్హేతుకమైన భయములను, చింతను అదుపులో ఉంచుకొనుటకు 'జాయిస్' గారి సలహాలు ఎంతో మేలైనవి.

నీ ప్రస్తుత జీవితము ఆనందమయంగా జీవించుటకు ఈ పుస్తకము ద్వారా నేర్చుకొని, క్రీస్తులోని నీ భవిష్యత్తు భద్రముగానున్నదన్న నిశ్చయత నీవు పొందగలవు.

---

### ఈ వరుసలోని ఇతర పుస్తకములు చదవండి

- *కృంగినతనమును గూర్చి ముక్కుసూటి మాట*
- *అభద్రతా భావమును గూర్చి ముక్కుసూటి మాట*
- *నిరుత్సాహమును గూర్చి ముక్కుసూటి మాట*
- *ఒంటరితనము గూర్చి ముక్కుసూటి మాట*
- *భయమును గూర్చి ముక్కుసూటి మాట*
- *మానసిక ఒత్తిడిని గూర్చి ముక్కుసూటి మాట*

JOYCE MEYER MINISTRIES®
Sharing Christ – Loving People

Post Bag No. 1, Jubilee Hills,
Hyderabad - 500 033